ముస్లిమ్ పర్సనల్ లా

నైతిక & న్యాయ సమస్యలు

విషయసూచిక

ప్రస్తుత పరిస్థితులు	3
ముస్లిమ్ పర్సనల్ లా అంటే ఏమిటి?	3
షరీఅత్ చట్టాలపై అభ్యంతరాలు	5
ఇస్లామ్‌లో నికాహ్ భావన	6
ఖుర్ఆన్ హదీసులు బోధించే వివాహ లక్ష్యాలు...	7
ఇస్లామ్ నికాహ్‌ను సులభతరం చేసింది	8
నికాహ్‌లో దుబారా	10
బహుభార్యత్వం	12
కుటుంబ వ్యవస్థలో స్త్రీ పురుషుల హక్కులు, బాధ్యతలు	13
భార్యల హక్కులు–బాధ్యతలు	16
భార్యాభర్తల సమానత్వం	19
తలాక్–ఒక అయిష్టకరమైన చర్య	20
తలాక్ రకాలు	21
తలాక్ విధానాలు	22
ముమ్మార్లు తలాక్	24
ఉద్దేశపూర్వకమైన హలాల నిషిద్ధం	24
ఖులా, ముబారాత్, విడిపోవడం	26
తలాక్ అధికారం	27
ఇద్దత్ (నిర్ణీత గడువు) రూపాలు, ఆదేశాలు	27
విడాకులు పొందిన స్త్రీ పోషణ ఎలా?	28
హజానత్ (పోషణ హక్కు)	29
ఇస్లామ్‌లో వారసత్వ హక్కులు	30
వారసత్వంలో కొన్ని సార్లు మహిళల వాటా తగ్గడానికి కారణం	32
అనాథ మనవలు, మనవరాళ్ల సంరక్షణ	33
దత్తత	36
ముస్లిమ్ పర్సనల్ లా అమలు ఎందుకు తప్పనిసరి?	38
ప్రస్తుత పరిస్థితుల సున్నితత్వం, మన బాధ్యతలు	39

అనంతకరుణామయుడు అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

ప్రస్తుత పరిస్థితులు

మనదేశంలో స్వాతంత్ర్యం తరువాత నుంచే ముస్లిముల కుటుంబ చట్టాల(ముస్లిమ్ పర్సనల్ లా)కు వ్యతిరేకంగా నిరసన గళాలు వినిపించడం మొదలయ్యాయి. ముస్లిముల షరీఅత్ చట్టాలను రద్దుచేసేందుకు కుట్రలు, కుతంత్రాలు అప్పటి నుంచే జరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో ఈ కుట్రలు మరింత వేడెక్కాయి. ప్రభుత్వ కుట్రలన్నీ తేటతెల్లమవుతున్నాయి. ఒక ముస్లిమేతర దంపతుల కోర్టు వ్యాజ్యం పరిష్కరించే విషయమై సుప్రీంకోర్టు ట్రిపుల్ తలాక్, బహుభార్యత్వానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు, లా కమిషన్ ప్రశ్నావళి తర్వాత కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం బయటపడింది. ఈ కుట్రపూరిత చర్యలతో ముస్లిమ్ సంస్థలు, ఉలమాలు, మేధావులు, సామాజిక కార్యకర్తలు, విజ్ఞులు అప్రమత్త మయ్యారు. వారిలో ఆలోచనలు మొదలయ్యాయి. ఈ విషయంలో ముస్లిమ్ సముదాయంలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముస్లిముల్లో షరీఅత్ ప్రబోధించే కుటుంబ చట్టాలను అనుసరించేలా ప్రేరణ కలిగించాలి. ముస్లిములు పాటించే కౌటుంబిక చట్టాలు ఖుర్ఆన్‌లో అంతర్భాగం. సత్యం, ధర్మం పునాదులపై ఈ చట్టాలు ఏర్పడ్డాయనే విషయంపై ముస్లిమేతరుల్లోనూ అవగాహన కల్పించాలి. ముస్లిములు అల్లాహ్ ప్రసాదించిన షరీఅత్ చట్టాల్లో మార్పులు చేర్పులను ఎన్నటికీ సహించరని, దీనికోసం తమ ప్రాణాలనుసైతం పణంగా పెడతారని, ఎంతటి త్యాగాలకైనా వెనకాడరనే హెచ్చరికలు ప్రభుత్వానికి చేరాలి.

ముస్లిమ్ పర్సనల్ లా అంటే ఏమిటి?

ఇస్లామ్ దైనందిన జీవితంలోని అన్ని రంగాలలో రుజుమార్గం చూపుతుంది. విశ్వాసులకు చట్టాలను, ఆదేశాలను అందిస్తుంది. కుటుంబ వ్యవస్థకు సంబంధించి పలు హితబోధనలు, సూచనలు ఈ ఆదేశాల్లో అంతర్భాగమే. కుటుంబ సభ్యుల హక్కులు, బాధ్యతలను విడమర్చి చెప్పింది. దీన్ని అరబీలో

'ఖవానీనె అహ్వాలె షక్సియ' తెలుగులో 'కౌటుంబిక చట్టాలు' ఇంగ్లీషులో 'పర్సనల్–లా' లేదా 'ఫ్యామిలీ లా' అని పిలుస్తారు.

భారతదేశంలో ముస్లిమ్ పాలకుల పరిపాలనలో ఇస్లామ్ చట్టాలు పూర్తిగా అమలులో ఉండేవి. ముస్లిములు ఈ చట్టాలకనుగుణంగా నడుచుకునేవారు. దేశ పరిపాలనా పగ్గాలు ఆంగ్లేయుల చేతిలోకి వెళ్లిపోయాక చాపకింద నీరులా ఇస్లామ్ చట్టాల స్థానంలో బ్రిటీషు చట్టాలు అమల్లోకి వచ్చాయి. మొట్టమొదటగా క్రిమినల్ చట్టాలను రద్దు చేశారు. సాక్ష్యాధారాల చట్టం (ఎవిడెన్స్ యాక్ట్), ఒప్పంద చట్టం (కాంట్రాక్ట్ యాక్ట్) రద్దు చేశారు. తదనంతరం కుటుంబ చట్టాలలో మార్పులు చేర్పులు చేసేందుకు కుట్రలు ప్రారంభించారు. ఈ విషయంలో ముస్లిమ్ ఉలమాలు అప్రమత్తమయ్యారు. దీనికి వ్యతిరేకంగా గళం విప్పారు. వీరి ఈ కృషి ఫలితమే 1937లో 'షరీఅత్ అప్లికేషన్ యాక్ట్' మంజూరైంది. ముస్లిమ్ పర్సనల్ లాలో ఉన్న 'షరీఅత్ యాక్ట్' ఏం చెబుతోందంటే కక్షి దారులు ముస్లిములైన పక్షంలో నికాహ్, మహర్, తలాఖ్, ఖులా, మనోవర్తి, నికాహ్‌రద్దు, విలాయత్, హిబా, విరాసత్, తదితర విషయాలన్నింటిలో నిర్ణాయక శాసనం షరీఅత్ చట్టం ప్రకారమే ఉంటుంది. వారి ఆచార వ్యవహారాలు ఏమైనా కావచ్చు. షరీఅత్ చట్టం వారి ఆచార వ్యవహారాలపై పూర్తి అధికారం, ఆధిక్యత హక్కు కలిగి ఉంటుంది. మొత్తం వ్యవస్థ అంతా దీని పరిధిలోకే వచ్చేస్తుంది. దీనినే ప్రస్తుతం ముస్లిమ్ పర్సనల్‌లాగా గుర్తిస్తున్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాజ్యాంగం రూపొందించబడింది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల వల్ల దేశ పౌరులందరికీ సమానంగా భావప్రకటనా స్వేచ్ఛ లభించింది. తమకు నచ్చిన మతాన్ని స్వేచ్ఛగా స్వీకరించే, దాన్ని ప్రచారం చేసుకునే హక్కు ఉంది. ఈ చట్టం ముస్లిమ్ పర్సనల్ లాను పరిరక్షించే హామీని యిస్తుంది. 'రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలులోని 44వ అధికరణ ప్రకారం ప్రభుత్వం కామన్ సివిల్ కోడ్‌ను అమలుపరిచే కృషిచేస్తుంది' అనే విషయం గమనించదగింది. ఈ రెండు విషయాలు పరస్పరం విరుద్ధమైనవి, విభిన్నమయినవి. అందుకోసమే రాజ్యాంగ నిర్మాణంలోని పలువురు ముస్లిమ్

సభ్యులు ఈ విషయంలో తీవ్రంగా విభేదించారు. దీన్ని తీవ్రంగా ఖండించారు. అయినప్పటికీ కామన్ సివిల్‌కోడ్‌కు సంబంధించిన ఈ అధికరణ రాజ్యాంగంలో అలాగే ఉండిపోయింది. దీన్ని అడ్డుపెట్టుకునే అప్పుడప్పుడూ ముస్లిమ్ పర్సనల్ లాను రద్దుచేసి కామన్ సివిల్‌కోడ్ అమలు చేయాలనే వ్యాఖ్యలు వినపడుతూ వచ్చాయి. ఆ ప్రయత్నాలు ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయి. న్యాయస్థానాలు కూడా తమ తీర్పుల్లో ముస్లిమ్ పర్సనల్‌లాకు వ్యతిరేకంగానే తీర్పులు చెబు తున్నాయి.

ఇస్లామిక్ కుటుంబ చట్టాలపై అభ్యంతరాలు

ప్రస్తుతం దేశంలో ఒక పథకం ప్రకారం ముస్లిమ్ పర్సనల్‌లాకు వ్యతిరేకంగా కుట్రపూరిత ఉద్యమం మొదలైంది. ముస్లిమ్ మహిళలు హింసాదౌర్జన్యాలకు గురవుతున్నారని, ఇస్లామిక్ చట్టాలు ముస్లిమ్ మహిళలకు న్యాయం చేయలేవని, రాజ్యాంగం ప్రకారం వీరికి న్యాయం చేసే బాధ్యత ప్రభుత్వానిదని మొసలికన్నీరు కారుస్తున్నారు. ముస్లిమ్ మహిళలకు న్యాయం చేసే సాకుతో ముస్లిమ్ పర్సనల్ లాను రద్దుచేసే కుట్రలు పన్నుతున్నారు. ఉదాహరణకు ఇస్లామ్ చూపే కుటుంబ చట్టాల ప్రకారం కేవలం భర్త మాత్రమే భార్యకి తలాఖ్ ఇచ్చే హక్కు కలిగి ఉన్నాడనీ, భర్త పెట్టే హింసను, అరాచకాలను భార్య భరించవలసి వస్తుందనీ, ఆమెకు ఎలాంటి హక్కులు లేవనీ, పురుషుడు ఒకరి కంటే ఎక్కువ మంది (నలుగురు) భార్యలను వివాహమాడవచ్చని, విడాకులు పొందిన స్త్రీకి ఇస్లామ్‌లో ఎలాంటి రక్షణ లేదనీ, ఆస్తి హక్కులో కుమారుడి వాటాలో సగమే కూతురికి లభిస్తుందనీ, ఏ కుటుంబమైనా సరే ఒక పిల్లవాడిని దత్తత తీసుకోవడం, ఆ పిల్లవాడ్ని కొడుకుగా భావించడం, దత్త పుత్రుడికి ఆస్తిలో వాటా కల్పించడం ఇస్లామ్ అనుమతించదనీ, ఇలాంటి అనేక విషయాలను వక్రీకరించి ముస్లిమ్ పర్సనల్‌లాకు వ్యతిరేకంగా దుష్ప్రచారం జరుగుతోంది. వీటిని వక్రీకరించి ఇస్లామ్ పట్ల అపార్థాలు, అపోహలు సృష్టించి ఇస్లామ్‌ను అపకీర్తిపాలు చేస్తున్నారు. ఇస్లామ్ చట్టాలను అమానుష చట్టాలుగా, స్త్రీల

హక్కుల్ని కాలరాసే చట్టాలుగా చిత్రీకరించి ప్రజల్లో ప్రచారం కల్పిస్తున్నారు. ముస్లిములు సైతం షరీఅత్ చట్టాల పట్ల సరైన అవగాహన కలిగి లేరు. ఈ చట్టాలను పెద్దగా ఆచరించడం లేదు. ముస్లిములు తమ కుటుంబ వివాదాలను షరీఅత్‌కు అనుగుణంగా పరిష్కరించుకునే బదులు ప్రభుత్వ కోర్టులనే ఆశ్రయిస్తున్నారు. అక్కడ షరీఅత్‌కు వ్యతిరేకంగా తీర్పులు వెలువడుతున్నాయి. అందుకే రాబోయే పుటల్లో షరీఅత్ చట్టాలను సంక్షిప్తంగా వివరించడం జరుగుతుంది. దీని ద్వారా తమ సమస్యలు తామే పరిష్కరించుకునే అవకాశం కలుగుతుంది.

ఇస్లామ్‌లో నికాహ్ భావన

నికాహ్ ఒక సామాజిక, ధార్మిక అవసరం. నికాహ్ అంటే వివాహం. ఇది అన్ని మత వర్గాలలోనూ ఆచరణలో ఉన్న సంప్రదాయం. ఇస్లామ్ ధర్మం వివాహానికి ఎనలేని ప్రాముఖ్యత ఇచ్చింది. ఇస్లామ్ ధర్మంలో తప్ప మరే మతంలోనూ ఇంత ప్రాధాన్యత, ప్రాముఖ్యత లేదు.

లైంగిక కోరికలు తీర్చుకోవడం మనిషి సహజ లక్షణం. కాని, కొందరు లైంగిక కోరికలు తీర్చుకోవడం అత్యంత హేయంగా, చెడుగా భావిస్తారు. లైంగిక కోరికల్ని త్యజించనంతవరకూ మనిషి ఆత్మ వికాసం చెందదని భావిస్తారు. లైంగిక కోరికల్ని త్యజించి వైరాగ్యాన్ని ఆహ్వానిస్తారు. మరికొంతమంది అతివాద వర్గాలు తమ లైంగిక కోరికల్ని తీర్చుకునేందుకు విచ్చలవిడితనాన్ని అనుసరిస్తారు. తమ మనోకాంక్షలకు అనుగుణంగా లైంగిక తృష్ణను తీర్చుకుంటారు.

లైంగిక కోరికలను తీర్చుకునే విషయంలో ఇస్లామ్ మధ్యే మార్గాన్ని బోధిస్తోంది. లైంగిక కోరికలను త్యజించడాన్నీ, విచ్చలవిడితనాన్ని ఈ రెండు మార్గాలను తప్పుపడుతోంది. మనిషిలోని లైంగికవాంఛను అణచడం లేదా విశృంఖలంగా తీర్చుకోవడం ఈ రెండింటిని ఇస్లామ్ అంగీకరించదు. లైంగిక కోరికల్ని అణచివేయడం, వైరాగ్యాన్ని ఆచరించడం ఇస్లామ్ తీవ్రంగా నిషేధించింది. లైంగికవాంఛల పరిపూర్తికి ధర్మబద్ధమైన వివాహ వ్యవస్థను నెలకొల్పింది. ఇస్లామ్ ఇలా బోధించింది:

మీలో ఎవరు వివాహం లేకుండా ఒంటరిగా ఉంటున్నారో; మీ స్త్రీ పురుష బానిసలలో ఎవరు గుణవంతులో వారి వివాహాలు చేసి వేయండి.

(దివ్యఖుర్ఆన్ 24 : 32)

సమాజంలో ఏ ఒక్కరూ పెళ్లికాని వారుండరాదని తాకీదు చేస్తోంది.

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారు:

"యువకుల్లారా! మీలో వివాహం చేసుకునే శక్తి కలవారు తప్పక వివాహం చేసుకోవాలి. ఎందుచేతనంటే, వివాహం దృష్టిని క్రిందికివాలేలా చేస్తుంది. మర్మస్థానాన్ని రక్షిస్తుంది." (సహీహ్ బుఖారి)

పవిత్రమైన సమాజ నిర్మాణం స్త్రీ పురుషుల పవిత్రమైన లైంగిక సంబంధాల మీద ఆధారపడి ఉంది. పవిత్ర సమాజ నిర్మాణానికి వైవాహిక వ్యవస్థ మూల స్తంభం లాంటింది. దాంపత్య బంధం ద్వారానే స్త్రీ పురుషుల్లో బాధ్యతా భావం జనిస్తుంది. ఆలుమగలిద్దరూ కలిసి తమ సంతానాన్ని పోషిస్తారు. సంతానానికి సరైన శిక్షణ, విద్యాబుద్ధులు నేర్పుతారు. భార్యాభర్తల మధ్య పరస్పర సదవగాహన, మానసిక ప్రేమానురాగాలు, పరస్పరం త్యాగం అలవడతాయి. ఒకరి మంచిచెడుల్లో ఒకరు చేదోడువాదోడుగా ఉంటారు. ఈ సుగుణాలు లేని పక్షంలో మానవ సమాజం జంతువుల సమూహంగా మారిపోతుంది. లైంగిక కోరికలు తీర్చుకోవడం తప్ప మరేమీ మిగిలి ఉండదు.

ఖుర్ఆన్ హదీసులు బోధించే వివాహ లక్ష్యాలు..

1. వివాహ లక్ష్యాలలో శీలరక్షణ అనేది మొదటి లక్ష్యం. దీనివల్ల మానవుడు షైతాన్ ఉచ్చునుండి బయటపడగలడు.

2. భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలు పెంపొంది వారిరువురూ ప్రశాంతంగా జీవితం గడుపుతారు.

"ఆయన మీ కొరకు భార్యలను మీ జాతిలో నుండే సృష్టించాడు. మీరు వారివద్ద శాంతిని పొందటానికి, మీ మధ్య ప్రేమనూ, కారుణ్యాన్నీ

సృజించాడు. నిశ్చయంగా ఆలోచనాపరులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి.” ***(దివ్యఖుర్ఆన్ 30 : 21)***

3. దీని మూడవ ఉద్దేశం దీనివల్ల మానవ జాతి మనుగడ, కుటుంబ వికాసం, నాగరికత, సంస్కృతుల అభివృద్ధి.

“అల్లాహ్‌యే మీకోసం మీ జాతి నుండే భార్యలను చేశాడు. ఆయనే ఆ భార్యల ద్వారా మీకు కుమారులను, మనుమలను ప్రసాదించాడు.” ***(దివ్యఖుర్ఆన్ 16 : 71)***

ఇస్లామీయ వివాహ చట్టంలో రెండు మాటల ఉచ్చారణతో పెళ్లితంతు ముగుస్తుంది. దీనినే ఈజాబ్ (ప్రతిపాదన), ఖుబూల్ (అంగీకారం) అని అంటారు.

అదేమంటే వరుడు లేదా వధువులో ఏ ఒక్కరు గానీ లేక వారి తరపున వకీల్ ద్వారా గాని నికాహ్‌కు ప్రతిపాదన తెలియజేయాలి. ఇద్దరు సాక్షుల సమక్షంలో అంగీకరించినట్లయితే నికాహ్ పూర్తవుతుంది. ప్రతిపాదనను ‘ఈజాబ్’ అని, ఖుబూల్ అంటే అంగీకరించాను అని భావం. వీరిరువురిలో ఏ ఒక్కరి అంగీకారం లేకపోయినా నికాహ్ జరగదు. నికాహ్ జరిగినట్లు ప్రకటించాలి. దీనిని రహస్యంగా ఉంచకూడదు. ఈజాబ్ (ప్రతిపాదన), ఖుబూల్ (అంగీకారం) ఇద్దరు సాక్షుల సమక్షంలో జరగాలి.

ఇస్లామ్ చట్టాలు వివాహం చేసుకునే విషయంలో స్త్రీలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాయి. యుక్తవయస్సుకు చేరిన అమ్మాయి వివాహాన్ని ఆమెకు ఇష్టంలేని అబ్బాయితో చేయకూడదు. పెళ్లి విషయంలో ఆమెకు సంపూర్ణ హక్కు, పూర్తి స్వేచ్ఛ ఇవ్వబడింది. ఆమె ఎవరినైనా ఇష్టపడవచ్చు. ఆమె తన ఇష్టాన్ని బాహాటంగా తెలిపే అధికారం కలిగి ఉంది. ప్రవక్త (స) ఇలా అన్నారు:

“స్త్రీల నికాహ్ వారి అనుమతితో చేయండి.”

ఇస్లామ్ నికాహ్‌ను సులభతరం చేసింది

ఇస్లామ్ వ్యభిచారాన్ని కష్టతరం చేసింది. అశ్లీల కార్యంగా ప్రకటించింది. ఈ విషయంలో కఠినమైన ఆదేశాలున్నాయి.

"వ్యభిచారం దరిదాపులకు కూడా పోకండి. అది అతిదుష్ట కార్యం. బహు చెడ్డ మార్గం." ***(దివ్యఖుర్ఆన్ 17 : 32)***

వ్యభిచారానికి పాల్పడిన వారిని వంద కొరడా దెబ్బలతో శిక్షించాలని, ఒకవేళ వివాహితుడైతే రాళ్లతో కొట్టి చంపాలని ఖుర్ఆన్ నిర్దేశిస్తోంది. నికాహ్ సులభతరం చేయబడినది. ముహమ్మద్ ప్రవక్త (స) ప్రబోధనలు, ఆయన జీవితాచరణ, సహాబాల ఆదర్శ జీవితం మనముందున్నాయి.

ప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు: **"అత్యంత తక్కువ ఖర్చుతో చేయ బడిన నికాహ్ శుభప్రదమైనది, పుణ్యప్రదమైనది."**

ప్రవక్త (స), సహాబా కాలంలో తలాఖ్ (విడాకులు) పొందినంత మాత్రాన, వితంతువుగా మారినంతమాత్రాన స్త్రీలు ఇంటికే పరిమితమవలేదు. సహాబా కాలంలో ఎవరైనా స్త్రీ తలాఖ్ పొందినా, లేక భర్త మరణంతో వితంతు వుగా మారినా జీవితాంతం అలానే ఉండిపోయే దుస్థితి ఉండేది కాదు. ఆమెకు మరో వివాహం జరిగిపోయేది. ఇలా చరిత్రలో రెండు, మూడు, నాలుగు వివాహాలు జరిగిన మహిళలు కూడా ఉన్నారు. ఆ కాలంలో వయస్సు ఎక్కువ తక్కువలు ఎలాంటి అవరోధాలుగా పరిగణించబడేవి కావు. చిన్న వయస్సున్న అమ్మాయిల వివాహం పెద్ద వయస్సున్న పురుషుడితో, పెద్ద వయస్సు ఉన్న స్త్రీ నికాహ్ నవ యువకునితో జరిగేది. వయోభేదం వల్ల ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు ఉండేవి కావు.

అబూబక్ర్ (రజి) కుమారుడు హజ్రత్ అబ్దుల్ రహ్మాన్ (ర) వివాహం హజ్రత్ ఆతిక (రజి) అనే మహిళతో జరిగింది. కొంతకాలానికే ఆయన ఒక యుద్ధంలో అమరులయ్యారు. దాంతో ఆతికా (రజి) వితంతువుగా మారారు. అప్పుడు హజ్రత్ జైద్ బిన్ అల్‌ఖిత్తాబ్ (రజి) ఆమెను పెళ్లాడారు. ఆ తరువాత కొంత కాలానికి రెండో భర్త కూడా అమరులవడంతో హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) ఆమెను నికాహ్ చేసుకున్నారు. ఆయనా అమరులవ్వడంతో హజ్రత్ హసన్ బిన్ అలీ (రజి) ఆమెను వివాహం చేసుకున్నారు. ఈ విధంగా ఆమె జౌజతుష్

నికాహ్‌లో చేసే దుబారా వ్యయాన్ని అరికట్టేందుకు, నిరాడంబర పెళ్ళిళ్లను ప్రోత్సహించేందుకు ముస్లిమ్ సమాజంలో ఉద్యమాలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది.

బహుభార్యత్వం

'ఇస్లామ్ చట్టం న్యాయప్రాతిపదికపై ఒక పురుషుడు నలుగురిని పెళ్లిచేసుకునే అనుమతిని ఇచ్చింది. ఒకే పర్యాయం ఒకరికంటే గరిష్ఠంగా నలుగురు భార్యలు కలిగి ఉండవచ్చు' (అన్ నిసా :3). ఇస్లామ్‌ను వ్యతిరేకించే వారు బహు భార్యత్వంపై తీవ్ర అభ్యంతరాలను సృష్టించి అనవసరంగా గగ్గోలు పెడుతున్నారు. ఈ విషయాన్ని అనేక కోణాల్లో చూడాల్సిన అవసరం ఉంది.

1. ప్రాథమికంగా ఇస్లామ్‌లో నలుగురేసి భార్యల్ని వివాహమాడాలన్నది ఆదేశం ఎంతమాత్రం కాదు. ఇది కేవలం పురుషుడికి కల్పించిన వెసులుబాటు మాత్రమే. ప్రతీ ఒక్కరు నాలుగేసి వివాహాల్ని చేసుకోవాల్సిన అవసరం ఎంతమాత్రమూ లేదు. పురుషుడికి గత్యంతరం లేని పక్షంలో మాత్రమే ఒకటికంటే ఎక్కువ (నాలుగు) వివాహాలు చేసుకునే అవకాశం ఇస్లామ్ కల్పించడం జరిగింది.
2. కొన్ని సందర్భాల్లో అసాధారణ పరిస్థితులు ఏర్పడవచ్చు. ఉదాహరణకు యుద్ధాల్లో, వేరితర ప్రమాద కారణాలతో ఒక ప్రాంతంలో పెద్ద సంఖ్యలో పురుషులు మరణించి స్త్రీల సంఖ్య అధికంగా పెరుగుతుంది. బహు భార్యత్వంతో ఈ సమస్యను అధిగమించవచ్చు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బహుభార్యత్వాన్ని అనుమతించని ఎడల అశ్లీలం, వ్యభిచారం, సామాజిక చెడుగులు పెరిగిపోయే ప్రమాదమూ లేకపోలేదు.
3. కొన్ని సందర్భాలలో బహుభార్యత్వం తప్పనిసరవుతుంది. ఉదాహరణకు ఒక స్త్రీ తీవ్రమైన వ్యాధికి గురైనప్పుడు వైద్య కారణాల వల్ల లైంగిక శక్తి కోల్పోయి దాంపత్య జీవితానికి అనర్హురాలైపోతుంది. అప్పుడు ఆ

పురుషుడు ఆమెకు తలాఖ్ ఇచ్చి రెండవ నికాహ్ చేసుకోవచ్చు లేదా ఆమెను కూడా భార్యగానే ఉంచుకుని మరో వివాహం చేసుకోవచ్చు. తమ బంధుగణంలో ఎవరైనా మహిళ విడాకులు పొందో లేక భర్త మరణంతో వితంతువుగా మారితే అలాంటి మహిళకు తోడు కల్పించే ఉద్దేశంతో మరో వివాహం చేసుకోవడంలో ఎలాంటి తప్పు లేదు.

4. భార్యలను సమాన దృష్టితో, పూర్తి న్యాయంగా చూడాలనే షరతులతోనే బహుభార్యత్వానికి ఖుర్‌ఆన్ అనుమతినిచ్చింది. నలుగురు స్త్రీలతో నికాహ్‌కు అనుమతి ఇస్తూ ఇలా ఆదేశించింది. **"అయితే వారితో న్యాయంగా వ్యవహరించలేమనే భయం మీకుంటే, అప్పుడు ఒకామెనే చేసుకోండి."** ***(దివ్యఖుర్‌ఆన్ 4 : 3)***

5. ముస్లిములు నలుగురేసి వివాహాలు చేసుకుంటారని, ముస్లిములలో బహుభార్యత్వం ఎక్కువనేది అవాస్తవం. ప్రతి పదేళ్లకోసారి కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జనగణన ప్రకారం బహుభార్యత్వ ఆచారం హిందూ సమాజంలోనే అధికంగా ఉంది. హిందూ చట్టాల ప్రకారం హిందూ పురుషులు ఒక భార్య ఉండగా మరో వివాహం చేసుకోవడానికి అనుమతి లేదు. పైగా ఇది నేరపూరిత చర్య కిందకు వస్తుంది.

కుటుంబ వ్యవస్థలో స్త్రీ పురుషుల హక్కులు, బాధ్యతలు

ఇస్లామ్ స్త్రీ పురుషులకు సమాన హక్కులు కల్పిస్తోంది. విద్యా, ఆర్థిక, సామాజిక, వారసత్వ హక్కులలో పురుషుడితో సమానంగా హక్కులు ప్రసాదించింది. పాశ్చాత్య దేశాలలో అనేక ఉద్యమాలు, విప్లవాలు, నిరసనల తరువాతనే మహిళలకు ఈ హక్కులు లభించాయి. ఇరవైయ్యో శతాబ్దంలో అందిన ఈ హక్కులు ఇస్లామ్ ధర్మం 15 వందల సంవత్సరాలకు పూర్వమే మగువలకు కల్పించింది. స్త్రీ పురుషులకు సమాన హక్కులు అంటే బాధ్యతల విషయంలో సమానత్వం కాదు. ఇస్లామ్ ధర్మం ఈ విషయంలో స్త్రీ పురుషుల

పరిధులను విభజించింది. వారి వారి సామర్థ్యాలకనుగుణంగా వారి వారి స్తోమతను, శక్తి సామర్థ్యాలను బట్టి పని విభజనను చేసింది. మహిళలకు పిల్లల పెంపకం, పోషణ, శిక్షణ, ఇంటి నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. మరోవైపు పురుషుడిపై తన ఇల్లు భార్యాపిల్లల సంరక్షణ బాధ్యతను మోపింది. ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు.

"పురుషుడు తన ఇంటి వారికి సంరక్షకుడు; స్త్రీ తన పతి గృహానికి అతని పిల్లలకూ సంరక్షకురాలు; ఈ విషయంలో వీరి సంరక్షణలో ఉన్నవారి పట్ల ప్రశ్నించడం జరుగుతుంది." ***(సహీహ్ బుఖారీ, ముస్లిమ్)***

స్త్రీ తన ఇంటి బాధ్యతలు చక్కగా నిర్వర్తించటం కోసం ఇంటి బయటి పనులు, సంపాదనా బాధ్యతల నుంచి మినహాయించడం జరిగింది. కాని ఆమె ఖర్చులు భరించే బాధ్యత, ఆమె ఇంటి అవసరాలు తీర్చే బాధ్యత మాత్రం ఇంటి యజమానిగా పురుషుడిపై మోపబడింది. దీని అర్థం ఇస్లామ్‌లో స్త్రీలపై పురుషులు పెత్తనం చెలాయించడం ఎంతమాత్రం కాదు. భార్య పట్ల ఇష్టమొచ్చిన విధంగా ప్రవర్తించే అధికారం ఇస్లామ్ కల్పించలేదు. ఉపాధి సంపాదన విషయంలో స్త్రీలను దూరంగా ఉంచటంలో ఆమెకు స్వేచ్ఛను కలిగించినట్లుగా భావించాలే తప్ప ఆమెపై చిన్నచూపు చూసే ఉద్దేశం ఎంతమాత్రం కాదు. మహిళలు ఆర్థికరంగంలో, వాణిజ్య వ్యవహారాల్లో ఎదుగుతున్నట్లయితే ఇస్లామ్ అలాంటి మహిళలను నిరాశపర్చదు. తన ఇంటి బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తూ షరీఅత్‌కు లోబడి వ్యాపార, ఉద్యోగ రంగాలలో చొరవ చూపించినట్లయితే ఎలాంటి అభ్యంతరాలు, మరెలాంటి ఆంక్షలు విధించదు. ఆమె సంపాదనపై స్వయంగా ఆమెకే పూర్తి అధికారాలు ప్రసాదించింది.

ఇస్లామ్‌లో స్త్రీ పురుషులు వేరు వేరు కారు, వారిరువురూ మిత్రులు. వారి వారి హక్కులు, బాధ్యతలు కూడా నిర్ణయించబడ్డాయి.

"విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ, వారందరూ ఒకరికొకరు సహచరులు." ***(దివ్యఖుర్‌ఆన్ 9 : 71)***

స్త్రీ, పురుషుల కార్యరంగాలు, వారి వారి హక్కులు బాధ్యతలను ఇస్లామ్ ధర్మం తేటతెల్లం చేస్తూ పురుషుడికి కొంత ఆధిక్యత ప్రసాదించింది. ఏ సంస్థ అయినా మనుగడ సాగించాలంటే, సవ్యంగా నడవాలంటే ఒక సంరక్షకుడు తప్పనిసరి. ఆ సంరక్షకుడు ఆ సంస్థలో పనిచేసే కార్మికుల పర్యవేక్షణ, అభివృద్ధి కోసం పాటుపడతాడు. అప్పుడే ఆ సంస్థ అభివృద్ధిపథంలో నడుస్తుంది. తన ఆధీనంలో పని చేసే వారి మధ్య ప్రేమ, సంక్షేమాన్ని గురించి అర్థం చేసుకొని వారి అవసరాలను గుర్తెరిగి, వారి వారి హక్కులను అందించినట్లయితే వారంతా ఎలాంటి చీకూచింతా లేకుండా శ్రద్ధాశక్తులతో పనిచేయగలరు. ఈ బాధ్యతల్ని కేవలం ఒక్కరికే ఇవ్వాలి. అలా కాకుండా సంస్థలో ప్రతి ఒక్కరూ తమ ఇష్టమొచ్చిన రీతిలో నిర్వహించాలంటే ఆ సంస్థ కార్యకలాపాలు ఛిన్నాభిన్నం కాగలవు. ఆ సంస్థ పురోభివృద్ధిలో పయనించే బదులు తిరోగమనంలో పయనిస్తుంది. నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. భార్యాభర్తలు కుటుంబ వ్యవస్థ రక్షణకు రెండు ప్రాథమిక మూల స్తంభాలు. కుటుంబ పర్యవేక్షణ ఒక్కరికే ఇవ్వబడుతుంది. ఇస్లాం ఈ బాధ్యతను పురుషుడికే అప్పజెప్పింది. ఖుర్ఆన్ దీనిని 'ఆధిక్యత'గా అభివర్ణించింది.

"మగవారికి మహిళలపై ఉన్నటువంటి హక్కులే ధర్మం ప్రకారం మహిళలకు కూడా మగవారిపై ఉన్నాయి. కాని పురుషులకు స్త్రీలపై కొంచెం ఆధిక్యం ఉన్నది." ***(దివ్యఖుర్ఆన్ 2 : 228)***

పురుషుడు తన సంపాదనతో భార్యాబిడ్డల్ని పోషిస్తాడు కనుకనే పురుషుడికి స్త్రీలపై ఆధిక్యతను కట్టబెట్టింది.

"పురుషులు స్త్రీలకు అధికారులు (ఖవ్వామ్), ఎందుకంటే అల్లాహ్ వారిలో ఒకరికి మరొకరిపై ఆధిక్యతలను ప్రసాదించటంవల్ల, ఇంకా పురుషులు తమ సంపదను వారికొరకు ఖర్చు చేస్తున్నందువల్ల."

(దివ్యఖుర్ఆన్ 4 : 34)

పురుషులకు అధికారం, ఆధిక్యత, పర్యవేక్షణ హక్కులు ప్రసాదించడంతో పాటు ఖుర్ఆన్, హదీసులో స్త్రీ పురుషుల హక్కులు, బాధ్యతలను స్పష్టంగా నిర్దేశించాడు అల్లాహ్.

భార్యల హక్కులు-బాధ్యతలు

హక్కులు, బాధ్యతల మధ్య అవినాభావ సంబంధం ఉంది. స్త్రీ పురుషులు దాంపత్య జీవితంలోకి అడుగుపెట్టడంతోనే భర్త హక్కులు భార్యల బాధ్యతలుగా, భార్యల హక్కులు భర్త బాధ్యతలుగా మారిపోతాయి.

"మగవారికి మహిళలపై ఉన్నటువంటి హక్కులే ధర్మం ప్రకారం మహిళలకు కూడా మగవారిపై ఉన్నాయి. కాని పురుషులకు స్త్రీలపై కొంచెం ఆధిక్యం ఉన్నది." ***(దివ్యఖుర్ఆన్ 2 : 228)***

దాంపత్య జీవితంలో భర్త ప్రధానంగా రెండు రకాల హక్కులను కలిగి ఉంటాడు. భార్య భర్తకు విధేయురాలిగా మెలగాలి. తన భర్తకు విధేయత చూపాలి.

"సుగుణవతులైన స్త్రీలు విధేయత కలిగివుంటారు. పురుషులు లేనప్పుడు అల్లాహ్ రక్షణలో ఉంటూ వారి హక్కులను కాపాడుతారు."

(దివ్యఖుర్ఆన్ 4 : 34)

పై ఖుర్ఆన్ ఆయత్‌లో శీలవతి అయిన భార్య రెండో సుగుణాన్ని వివరించింది. భర్త పరోక్షంలో కూడా తమ శీలాన్ని కాపాడుకుంటారు. ఇదే భర్త రెండో హక్కు. భర్త గైర్హాజరీలో భార్య తన అధీనంలో ఉన్న అప్పగింతలను కంటికి రెప్పలా కాపాడాలి. శీల రక్షణ, ధన, మానాల రక్షణ. పిల్లల పెంపకం, శిక్షణ, భర్త రహస్యాలను బహిర్గతం కాకుండా చూడటం, ఇంటిగుట్టు బయటపెట్టకుండా కాపాడటం ఇవన్నీ ఇందులో ఇమిడి ఉన్నాయి.

ఇస్లామీయ కుటుంబ చట్టాలు భార్య హక్కులకు రక్షణగా నిలిచింది. తద్వారా భర్త తన హక్కులను సాకుగా చూపి భార్యపై దౌర్జన్యానికి పాల్పడే అవకాశం ఉండదు. సామాజిక వ్యవస్థలో తన సహజ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిం చవచ్చు. దాంపత్య జీవితంలో భార్యకు ప్రసాదించిన ప్రాథమిక హక్కు మహర్. అల్లాహ్, మహర్ చెల్లించమని భర్తను ఆదేశించాడు.

"స్త్రీలకు వారి మహర్‌ను సంతోషంగా చెల్లించండి."

(దివ్యఖుర్ఆన్ 4 : 4)

నికాహ్ సమయంలో వరుడు, వధువుకు చెల్లించే సొత్తును మహర్ అంటారు. లేదా మహర్ చెల్లిస్తానని పెళ్లిలో వాగ్దానం చేస్తాడు. మహర్‌లో కూడా రెండు రకాలున్నాయి. ఒకటి, మహరె ముఅజ్జల్. దీనికింద పరిగణించే మహర్‌ను నికాహ్ జరిగిన మరుక్షణమే చెల్లించాలి. రెండవది; మహరె మౌజల్ అనగా ఈ మహర్ పైకాన్ని కొంత గడువు తీసుకుని చెల్లించే వాగ్దానం చేస్తాడు. వధువుకు వరుడు మహర్ చెల్లించడం తప్పనిసరి విధి. అందుకే వరుడు తన స్థోమతను బట్టి మహర్‌ను నిర్ణయించాలి. ప్రదర్శనాబుద్ధితోనో, గొప్పలకు, డాంభికాల కోసమో, మహర్‌ను ఎక్కువగా కేటాయించడం షరీఅత్ స్ఫూర్తికి విరుద్ధం. రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ బిన్ అల్ ఖత్తాబ్ (రజి) పరిపాలనా కాలంలో మహర్‌ను అత్యధికంగా నిర్ణయించే వారు. దీన్ని గమనించి ఒకసారి హజ్రత్ ఉమర్ (రజి) ముస్లిములనుద్దేశించి ప్రసంగించారు: "సావధానంగా వినండి, మహిళల మహర్‌ను నిర్ణయించడంలో అతిశయానికి పోయి పెద్దపెద్ద మొత్తాలు నిర్ణయించకండి. ఎందుచేతనంటే ఇలా చెయ్యడం ప్రపంచంలో ఏమాత్రమయినా గౌరవ కారణమయ్యే విషయమయితే, దేవుని దృష్టిలో భయభక్తులకు గుర్తు అయితే, దీన్ని ఆచరించే అధికారం అత్యధికంగా దైవప్రవక్త (స)కు ఉండేది (అబూదావూద్ : 2106). ముహమ్మద్ ప్రవక్త (స) తమ కుమార్తె హజ్రత్ ఫాతిమా (రజి), హజ్రత్ అలీ (రజి)ల వివాహంలో ఐదు వందల దిర్హంలు నిర్ణయించారు. దీనిని మహరె ఫాతిమీ అని చెబుతారు. ఇది ప్రస్తుతం కేజిన్నర వెండికి సమానం.

ఒకవేళ నికాహ్ సందర్భంలో మహర్ చెల్లించని ఎడల అది రద్దు కాదు. మహర్‌ను తప్పని సరిగా ఇవ్వాలి. ఇది ఆమె ఆర్థిక హక్కు. మహర్ పరిమితి సాధారణంగా ఆమె కుటుంబ స్థోమత ఆధారంగా నిర్ణయించబడుతుంది. మహర్ పైకానికి బదులుగా స్థిర, చరాస్తులు కూడా మహర్‌గా ఇవ్వవచ్చు. ఉదాహరణకు ఇల్లు, భూమి, తదితర ఆస్తులు ఇవ్వవచ్చు. నికాహ్ సమయంలో మహర్ బంగారు ఆభరణాల రూపంలో కూడా అందివ్వవచ్చు. అయితే ఇది మహర్‌కు బదులుగా ఇస్తున్నామని ప్రకటించాలి.

భార్య రెండవ హక్కు భర్త ఆమెకు కొంత నగదు సమకూర్చాలి. ఆ నగదు ఆమె అవసరాలకు ఖర్చు చేసే విధంగా ఉండాలి. ఇది ఆమె రెండవ హక్కు. భార్య పోషణ కోసం తిండి బట్ట, ఇల్లు తదితర జీవనావసరాలు సమకూర్చాలి. ఇది భర్త కర్తవ్యం. భర్త ఆర్థిక స్థోమతను బట్టి ఈ ఏర్పాట్లు చేయాలి. భర్త తన సంపాదనా పరిమితిని బట్టి భార్యపై ఖర్చు చేయాలి.

"మీరు మీ స్త్రీలను ముట్టుకోకముందే లేక వారి మహర్ (స్త్రీ ధనం) నిర్ణయం కాకపూర్వమే మీరు వారికి విడాకులిస్తే, అది పాపం కాదు. అప్పుడు మీరు వారికి ఏదో కొంత తప్పకుండా ఇవ్వాలి. ధనవంతుడైన వ్యక్తి తన శక్తి కొలదీ, పేదవాడైన మనిషి తన స్థితిని బట్టీ ధర్మసమ్మతమైన విధంగా చెల్లిం చాలి. ఇది సజ్జనులైన వారి విధి."

(దివ్యఖుర్‌ఆన్ 2 : 236)

నగదులో స్త్రీ నిత్యావసరాలు, అలంకార వస్తువులు, మందులు, వైద్య ఖర్చులు అందులోని భాగమే. భార్య తన భర్త డబ్బును అవసరానికి ఖర్చు చేసుకునే అధికారం కలిగి ఉంది. అయితే భర్త ఆమెకు అనుమతి ఇచ్చి యుండాలి. భర్త ఇంటి ఖర్చులకు ఇచ్చిన డబ్బును పొదుపుగా వాడుకొని కొంత పైకాన్ని మిగిల్చుకుంటే దానిపై పూర్తి హక్కు ఆమెకే దక్కుతుంది.

భర్త తన భార్య పట్ల సద్భావనతో, మంచిగా మెలగడమనేది భార్య మూడో హక్కు. ఖుర్‌ఆన్ హదీసుల్లో ఈ విషయాల ప్రస్తావన ఉంది.

"వారితో సద్భావంతో జీవితం గడపండి." ***(దివ్యఖుర్‌ఆన్ 4 : 19)***

ఒక హదీసులో ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

"విశ్వాసులలో అందరికన్నా గుణవంతుడే పరిపూర్ణ విశ్వాసి. అలాగే మీ భార్యల పట్ల మంచివాడే మీలో అందరికన్నా శ్రేష్ఠుడు." (తిర్మిజీ)

దంపతుల మధ్య మనస్పర్థలు- వాటి పరిష్కారాలు

ఆలూమగలు అల్లాహ్ హద్దుల్ని గౌరవిస్తూ వాటికి కట్టుబడి జీవిస్తూ, పరస్పరం ప్రేమానురాగాలు, సదవగాహనతో ఒకరునొకరు అర్థం చేసుకోవాలి. ఒకరి హక్కులను మరొకరు గుర్తించి తమ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి. ఇరువురూ ఒకరి బలహీనతలను, లోపాలను చూసీ చూడనట్లు వదిలేయాలి. కలిసిమెలిసి తమ సంతానానికి చక్కని శిక్షణను అందిస్తూ వారి చదువు సంధ్యలపై దృష్టి సారించినట్లయితే ఆ ఇల్లు స్వర్గధామంగా విలసిల్లు తుంది. దీనికి భిన్నంగా దంపతులిరువురూ తమ హక్కులను, బాధ్యతలను గుర్తించకపోతే భర్త భార్యపై దౌర్జన్యానికి పాల్పడటం, వేధింపులకు గురిచేయడం, అలాగే భార్య తన భర్త ఆజ్ఞలను ఉల్లంఘించి తన ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించి నట్లయితే ఆ ఇల్లు నరకకూపంగా మారిపోతుంది. భార్యాభర్తల మధ్య పవిత్ర బంధం మంటకలిసిపోతుంది. దాంపత్య సుఖం మృగ్యమైపోతుంది. ఆ తరువాత పిల్లలను సరైన రీతిలో తీర్చిదిద్దలేరు. వారికి సరైన విద్యాబుద్ధులు అందించలేరు.

ఈ విషయంలో ఖుర్ఆన్ ముఖ్యంగా పురుషుల ఆధిపత్యాన్ని, భార్యల అవిధేయతను సంస్కరించాలని హితవుపలికింది. ఖుర్ఆన్ ఆదేశానుసారం భార్యలో ఒక లోపం నచ్చని కారణాన ఆమెతో తెగతెంపులు చేసుకోవద్దని, ఆ నచ్చని దాంట్లోనే భర్త మేలు దాగి ఉండవచ్చని ఖుర్ఆన్ హితవు పలుకుతుంది: **"ఒకవేళ మీకు వారు నచ్చకపోతే, బహుశా మీకు ఒక వస్తువు నచ్చకపోవచ్చు. కాని అందులోనే అల్లాహ్ ఎంతో మేలును పెట్టివుండవచ్చు." (దివ్యఖుర్ఆన్ 4 : 19)** దివ్యఖుర్ఆన్ మరో అడుగు ముందుకేసి భార్య వల్ల ఏదైనా తప్పిదం జరిగినా, అవిధేయతకు పాల్పడినా ఆమెకు నచ్చజెప్పి దారికి తెచ్చుకోవాలని, సయోధ్య కుదుర్చుకోవాలని ఖుర్ఆన్ స్పష్టం చేస్తోంది. ఒకవేళ అప్పటికీ ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోతే ఆమె పడకను వేరు చేయమని ఖుర్ఆన్ అంటోంది. అయినప్పటికీ ఆమెలో ఎలాంటి మార్పు రాకపోతే సున్నితంగా ఆమెను దండించాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమెను వేధింపులకు గురిచేయకూడదు.

ఆలుమగల మధ్య విభేదాలు దూరం చేసేందుకు కుటుంబీకుల ప్రయత్నం

భార్యాభర్తల మధ్య మనస్పర్థలు, విభేదాలు పొడసూపినప్పుడు వాటిని మొగ్గలోనే తుంచేయాలి. వారిరువురు వాటిని దూరం చేసుకునేందుకు ప్రయత్నించాలి. అయినప్పటికీ ఇద్దరి మనసుల్లో ఒకరిపట్ల ఒకరికి ఏహ్యాభావం, ఇద్దరి మధ్య పొరపొచ్చాలు దూరం కానప్పుడు ఇరు కుటుంబాల్లోని పెద్దలు కూర్చుని వారిరువురి మధ్య రాజీ కుదిర్చే ప్రయత్నాలు చేయాలి. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు;

"భార్యాభర్తల మధ్య సంబంధాలు చెడిపోతాయనే భయం మీకు కలిగితే, భర్త బంధువుల నుండి ఒక మధ్యవర్తిని, భార్య బంధువుల నుండి ఒక మధ్యవర్తిని నియమించండి. వారిద్దరు సంస్కరణను కోరితే అల్లాహ్ వారిమధ్య సమాధానం కుదరటానికి మార్గం చూపుతాడు."

(దివ్యఖుర్ఆన్ 4 : 35)

ఒకవేళ ఈ ప్రయత్నాలన్నీ విఫలమై ఆలుమగల మధ్య కీచులాటలు హద్దు మీరిపోయినప్పుడు వారిద్దరి దాంపత్య జీవితం దుర్భరమవుతుంది. ఎవరి దారి వాళ్లు చూసుకోవడం మేలు. దంపతులిద్దరూ విడిపోయి వారికి తగ్గ సంబంధాలు ఎంచుకొని రెండో పెళ్లి చేసుకోవడం ఉత్తమం. ఇంతకు మించి వేరే గత్యంతరం లేదు.

తలాక్- ఒక అయిష్టకరమైన చర్య

నేడు మీడియాలో తలాక్ అంశం చర్చనీయాంశమై ఉంది. మహిళలు దౌర్జన్యానికి గురవుతున్నారని ప్రచారం జరుగుతోంది. తలాక్‌ను ఒక దౌర్జన్య పూరితమైన చర్యగా నిర్ధారిస్తున్నారు. దీనిపై నిషేధం విధించాలని కోరుతున్నారు. దీనికి కారణం ప్రజలు దీనిలోని మర్మాన్ని తెలుసుకోకపోవడమే. ఇస్లామీయ షరీఅత్‌లో దీనికి ఉన్న అవసరం, ప్రాముఖ్యత ఏమిటో వారికి తెలియడం లేదు.

వివాహం స్త్రీ పురుషుల మధ్య ఒక ఒప్పందం. ఖుర్ఆన్ దీన్ని 'మీసాకె గలీజ్' (దృఢమైన ఒప్పందం)గా పేర్కొంది. కనుక వివాహ బంధాన్ని వీలైనంత

వరకు నిర్వర్తించడానికి ప్రయత్నించాలి. భార్యాభర్తల మధ్య అన్ని రకాల సయోధ్యలు, మధ్యవర్తిత్వాలు కుదరనప్పుడు చివరిగా తలాక్ వైపు మళ్ళాలి.

తలాక్ ఒక శస్త్ర చికిత్స లాంటిది. అన్ని రకాల మందులు, వైద్యచికిత్సలు చేయిదాటి పోయినప్పుడే దీని అవసరం ఏర్పడుతుంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చినప్పుడు, వారి సయోధ్యకు ఎలాంటి సంప్రదింపులు సఫలం కాకపోతే దాంపత్య జీవితంలోని ఆ వైరుధ్యాన్ని దూరం చేసేందుకు తలాక్ విధానాన్ని షరీఅత్ అనుమతించింది. ఆపరేషన్ విఫలమై రోగి మరణిస్తే ఆపరేషన్‌లను నిషేధించాలని ఎవరూ అనరు. అదేవిధంగా ఒకవేళ తలాక్ దుర్వినియోగం అవుతుంటే దానిపై నిషేధం విధించాలనడం సబబు కాదు. దీనికి ప్రతిగా దాని అవసరాన్ని అంగీకరించి, దాన్ని సరిగ్గా వినియోగించుకోవడానికి ప్రయత్నించాలి.

భార్యాభర్తలు కలిసి ఇక ముందు జీవితం కొనసాగించలేరు, భార్య పట్ల భర్త అసహనం తీవ్ర స్థాయికి చేరుకుంది అన్నప్పుడు మాత్రమే షరీఅత్ తలాక్‌కు అనుమతి ఇస్తుంది. తలాక్ అంటే, బంధాన్ని విడదీయడం. అంటే నికాహ్ ద్వారా ఏర్పడిన బంధాన్ని తలాక్ ద్వారా విడదీయడం జరుగుతుంది. ఇస్లామీయ షరీఅత్‌లో తలాక్ అనుమతి ఇవ్వడమయితే జరిగింది. కాని దాన్ని అయిష్టకర మైన చర్యగా పేర్కొనడం జరిగింది. ఒక హదీసులో ఇలా ఉంది: **'ఒక కుటుంబం సర్వనాశనమైనప్పుడు, భార్యాభర్తలు విడిపోయినప్పుడు షైతాన్‌కు అమితంగా సంతోషం కలుగుతుంది'** ***(ముస్లిమ్ : 2813).***

తలాక్ రకాలు

తలాక్‌లో మూడు రకాలున్నాయి

(1) తలాకె రజ్‌యీ : అంటే ఈ తలాక్ తరువాత భర్త కొత్తగా మరో వివాహం చేసుకోకుండా భార్యను తిరిగి స్వీకరించవచ్చు. భర్త స్పష్టమైన వాక్యాల ద్వారా తలాక్ ఇచ్చిన తరువాత భార్య ఇద్దత్ (నిర్ణీత గడువు) పూర్తికాక మునుపే భర్త ఆమెను స్వీకరించాలనుకున్నప్పుడు ఇది సాధ్యమవుతుంది.

(2) తలాకె బాయిన్ : తలాక్ అయిపోయిన తరువాత, అంటే భర్త తలాక్ ఇచ్చిన తరువాత ఇద్దత్ పూర్తయినప్పుడు, భర్త భార్య ఇష్టంతో ఆమెను మళ్ళీ వివాహం చేసుకోవచ్చు. దీనికి భార్య అభీష్టం తప్పనిసరి. ఆమె మళ్లీ కొత్తగా మహర్‌కు అర్హురాలవుతుంది.

(3) తలాకె ముగల్లజ : ఈ తలాక్ తరువాత భర్త భార్యను మళ్లీ స్వీకరించలేడు. ఇది మూడో తలాక్ ఇచ్చిన తరువాత జరుగుతుంది. తలాకె ముగల్లజ తరువాత భార్య భర్తకు నిషేధం అవుతుంది. అయితే ఒకవేళ ఆమె ఇతర వ్యక్తిని వివాహం చేసుకుంటే, అతను కూడా ఆమెకు విడాకులిస్తే లేదా మరణిస్తే అప్పుడు ఆమెను మళ్ళీ మాజీ భర్త ఇష్టమైతే వివాహం చేసుకోగలడు.

తలాక్ విధానాలు

తలాక్‌లో రెండు విధానాలున్నాయి:

(1) **తలాకె సున్నత్ :** దీని విధానం ఏమిటంటే, భర్త భార్యకు పరిశుద్ధావస్థలో (బహిష్టులో లేనప్పుడు), ఆమెతో సంభోగించకుండా ఒక తలాకె రజ్‌యీ ఇవ్వాలి. ఆ తరువాత ఇద్దత్ (నిర్ణీత గడువు) పూర్తవనివ్వాలి. ఇద్దత్ పూర్తవగానే ఒక తలాకె బాయిన్ అమలవుతుంది. అప్పుడు ఇద్దరూ విడిపోతారు. ఇది ఉత్తమమైన తలాక్. భర్త ఇలా కూడా చేయవచ్చు. పరిశుద్ధావస్థలో ఒక తలాక్ ఇవ్వాలి. బహిష్టు తరువాత భార్య మళ్లీ పరిశుద్ధావస్థలోకి వస్తే రెండో తలాక్ ఇవ్వాలి. అదేవిధంగా పరిశుద్ధావస్థలో మూడో తలాక్ ఇవ్వాలి. దీనికి కూడా నిబంధన ఏమిటంటే, ఈ కాలంలో భార్యతో సంభోగించ కూడదు. దీన్ని తలాకె హసన్ 'ఉత్తమమైన తలాక్' అంటారు.

(2) **తలాకె బిద్‌అత్ :** అంటే ప్రవక్త (స) సంప్రదాయానికి విరుద్ధంగా ఇచ్చిన తలాక్. మనిషి ఒకే సారి రెండు లేదా మూడు తలాక్‌లు ఇవ్వడం. లేదా

బహిష్టులో ఉన్నప్పుడు తలాక్ ఇవ్వడం. లేదా పరిశుద్ధావస్థలో ఉండి సంభోగించిన తరువాత తలాక్ ఇవ్వడం.

తలాక్ ఇచ్చే పరిస్థితే దాపురిస్తే అభిలషణీయమైన పద్ధతినే అవలం బించాలి. అంటే ఒక తలాక్ ఇచ్చి వదలిపెట్టాలి. తలాకె బిద్అత్ నుంచి వారిం చడం జరిగింది. కాని ఒకవేళ ఎవరైనా వ్యక్తి ఈ తలాక్ ఇచ్చినా అది అమలు అవుతుంది. తలాక్ ఇచ్చే వాడు పాపాత్ముడవుతాడు. ఉత్తమమైన తలాక్‌లో భర్తకు బాగా ఆలోచించుకునే అవకాశం లభిస్తుంది. భార్య ఇద్దత్ కాలంలో అతని ఇంట్లోనే ఉంటుంది. ఒకవేళ భర్త కావాలనుకుంటే ఇద్దత్ పూర్తికాక మునుపే ఆమెను తిరిగి స్వీకరించవచ్చు. ఒకవేళ ఇద్దత్ గడిచిపోతే ఆమె స్వతంత్రురాలవు తుంది. అయినప్పటికీ భర్త కావాలనుకుంటే భార్య కూడా ఇష్టపడితే ఇద్దరూ కొత్త మహర్‌తో మళ్లీ వివాహం చేసుకోవచ్చు. తలాక్ ఉద్దేశ్యం వివాహ బంధాన్ని తెంచడం. తలాక్ ద్వారా ఈ ఉద్దేశ్యాన్ని నెరవేర్చవచ్చు.

జీవితంలోని ప్రతి వ్యవహారంలో మానవ వైఖరి ఎలా ఉంటుందంటే, ఏ వస్తువు అవసరం ఎంతగా ఉంటుందో మనిషి దాన్ని అంతగానే వినియోగిస్తాడు. ఒక గ్లాసు నీళ్ళ ద్వారా దప్పిక తీరితే పది గ్లాసుల నీళ్లు త్రాగడు. పిల్లాడిని ఒక దెబ్బకొట్టి సంస్కరించే వీలున్నప్పుడు బెత్తంతో ఎవరూ కొట్టరు. ఒక మాత్రతో ఒళ్ళునొప్పులు తగ్గిపోతే, నెలల తరబడి మందులు వాడరు. భర్త భార్యను వదలిపెట్టాలని నిర్ణయించుకున్నప్పుడు ఒక తలాక్‌తో సరిపోయేదానికి ఒకే సారి మూడు మార్లు తలాక్ ఇవ్వాల్సిన అవసరమేముంది?

ఈ విషయంలో ఖుర్ఆన్ ఉద్దేశ్యం ఏమై ఉంటుందంటే, అది పురుషునికి రెండు మార్లు వేరు వేరుగా అవకాశం ఇవ్వదలచుకుంది (అల్ బఖర : 229). కనుక అది హెచ్చ రిస్తుంది; ఒకవేళ భర్త మూడు సార్లు తలాక్ ఇస్తే, అతను మళ్లీ ఎప్పటికీ తన భార్యను పొందలేడు (అల్ బఖర : 230). ఒకే సారి ముమ్మార్లు తలాక్ ఇవ్వడం వల్ల ఈ అవకాశం వృధా అవుతుంది. ఈ కారణం గానే ప్రవక్త (స) కాలంలో ఒక సారి ఒక వ్యక్తి ఒకేసారి ముమ్మార్లు తలాక్ ఇచ్చాడు. ఈ సమాచారం ప్రవక్త (స)కు చేరింది. దానికి ప్రవక్త (స) తీవ్ర

ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. ఇలా అన్నారు: **'నేనున్నప్పుడు అల్లాహ్ గ్రంథంతో పరిహాసమాడుతున్నారా?'** ***(నసాయి : 3401)***

మూమ్మార్లు తలాక్

ఒకవేళ ఎవరయినా వ్యక్తి ఒకేసారి మూడు తలాక్‌లు ఇస్తే ఆదేశం ఏమిటి? ఈ విషయానికి సంబంధించి సమాజంలో రెండు అభిప్రాయాలున్నాయి. అనేక మంది సహాబా, తాబయీన్, నలుగురు ఇమాములు దీన్ని మూడు తలాక్‌లుగా పరిగణిస్తారు. కొందరు సహాబా, తాబయీన్‌లు తప్ప అల్లామ ఇబ్నె తైమియ్య, అల్లామ ఇబ్నె ఖయ్యిమ్, షేఖ్ దావూద్ జాహిరీ మరియు అల్లామ షౌకానీ రహిమహుముల్లాహ్, అహ్లె హదీస్‌ల వద్ద దీన్ని ఒకే తలాక్‌గా పరిగణిస్తారు. ఇరు వర్గాల వారి వద్ద వారి వారి ఆధారాలున్నాయి. దానిపై దీర్ఘకాలంగా ఆచరిస్తూ వస్తున్నారు.

హనఫీ పంథా పండితులు ఏమంటారంటే, ఎవరయినా వ్యక్తి తలాక్ ఇచ్చేటప్పుడు ఒకటికంటే ఎక్కువసార్లు తలాక్ పదాన్ని వినియోగించి, తాను ఒకే తలాక్‌గా సంకల్పం చేసుకున్నానని అంటే, అతను కేవలం తన మాటను నొక్కి చెప్పడానికి ఒకటికంటే ఎక్కువ సార్లు ఈ పదాన్ని పునరుక్తం చేశాడని అంగీకరించాల్సి ఉంటుంది. అలాంటప్పుడు అది ఒకే తలాక్‌గా పరిగణించబడుతుంది.

తలాక్ వ్యవహారంలో ముస్లిమ్ ప్రజానీకం మధ్య అతిపెద్ద అపోహ నెలకొని ఉంది. అదేమిటంటే, ముమ్మార్లు తలాక్ ఇవ్వనంత వరకు తలాక్ కాదని చెబుతుంటారు లేదా వారు అలా భావిస్తుంటారు. వారిలో ఉన్న ఈ అపోహను దూరం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఉద్దేశ్యపూర్వకమైన హలాల నిషిద్ధం

ముస్లిముల్లో కొందరు అజ్ఞానం కారణంగా కోపంలో ఒకే సారి ముమ్మార్లు తలాక్ ఇచ్చేస్తుంటారు. అప్పటి నుంచి వారి భార్య వారికి నిషిద్ధం అవుతుంది. మళ్లీ ఆమె ధర్మసమ్మతం కావాలంటే సహజ సిద్ధంగా ఖుర్‌ఆన్‌లో పేర్కొన్న పరిస్థితి (అల్ బఖర : 230) ఏర్పడాలి. అంటే, విడాకులిచ్చిన భార్యను వేరే వారు

వివాహం చేసుకుని, మళ్లీ వారు ఆమెకు విడాకులిస్తే అప్పుడు అతని మాజీ భర్త ఆమెను వివాహం చేసుకోవడం సమ్మతం అవుతుంది. దీనిని 'హలాల' అని నిర్వచిస్తారు.

ఎలాంటి ఉద్దేశ్యం లేకుండా ఈ పరిస్థితి తలెత్తితే, అంటే ఎవరయినా వ్యక్తి తన భార్యకు ముమ్మార్లు తలాక్ ఇచ్చాడు. ఆ తరువాత ఆమె వివాహం వేరే పురుషునితో జరిగింది. ఏదైనా కారణంతో అతను ఆమెకు విడాకులిచ్చాడు. లేదా అతను చనిపోయాడు. అలాంటప్పుడు మొదటి భర్త ఆమెను మళ్లీ వివాహం చేసుకోవచ్చు. కాని ఈ పద్ధతి ఉద్దేశ్యపూర్వకంగా జరిగినట్లయితే ఇది అత్యంత హేయమైన, నికృష్టమైన చర్య. ఇది ఇస్లామ్ ధర్మంలో హరామ్. ఇలాంటి దుశ్చేష్ట కోసం ముందుకొచ్చే వారిని దైవ ప్రవక్త (స) అద్దె దున్నపోతుతో పోల్చారు.

హజ్రత్ ఉక్బా బిన్ ఆమిర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం ఒకసారి ప్రవక్త (స) సహాబాను ప్రశ్నించారు: 'అద్దె దున్నపోతులు ఎవరో మీకు తెలుపనా?' అని. 'తెలుపండి ఓ దైవ ప్రవక్తా!' అన్నారు సహాబా. అప్పుడు దైవ ప్రవక్త (స) 'ముహల్లిల్ వ్యక్తి' అన్నారు. అంటే భార్యకు ముమ్మార్లు తలాక్ ఇచ్చిన వ్యక్తి భార్యను వివాహం చేసుకుని, ఆమెకు విడాకులిస్తానని ముందుకు వచ్చేవాడు. అలా ఒప్పందం ప్రకారం మొదటి భర్తకు ఆమెను ధర్మసమ్మతం చేసేవాడు. ఆ తరుషాత ప్రవక్త (స) ఇలా అన్నారు:

> **'ఈ కార్యం కోసం తనను ప్రవేశపెట్టేవారిపై అల్లాహ్ అభిశాపం పడుగాక, ఈ పని చేయించిన వ్యక్తిపై కూడా'.** ***(ఇబ్నె మాజ : 1936)***

ఆలోచించాల్సిన విషయం ఏమిటంటే, ఒకే తలాక్ ద్వారా భార్య నుంచి విడిపోయే వీలున్నప్పుడు మూడు తలాక్‌లు ఇవ్వడం ఎందుకు? ముమ్మార్లు తలాక్ ఇచ్చిన తరువాత భార్య శాశ్వతంగా హరామ్ అయితే, ఆమెను ధర్మ సమ్మతం చేసుకోవడం కోసం అధర్మమైన, ప్రవక్త (స) అభిశపించిన, అత్యంత హేయంగా పేర్కొన్న పద్ధతులను అవలంబించడమేమిటి? అసలెవరైనా ఇలా చేస్తారా?

ఇస్లామ్‌లో ఇది ధర్మసమ్మతం కూడా కాదు. ముమ్మార్లు తలాక్ ఇవ్వాల్సిన పరిస్థితి తలెత్తకపోవడమే మంచిది.

ఖులా, ముబారాత్, విడిపోవడం

భార్యాభర్తలు కలిసి జీవించే పరిస్థితి లేనప్పుడు వారు విడిపోవడానికి షరీఅత్ పురుషునికి ఏవిధంగానయితే తలాక్ ఇచ్చే హక్కును కల్పించిందో అదేవిధంగా మహిళలకు కూడా ఖులా హక్కును ప్రసాదించింది. తలాక్, ఖులాలో వ్యత్యాసం ఏమిటంటే, తలాక్ స్థితిలో భార్య నుంచి మహర్ సొమ్ము తీసుకునే హక్కు ఉండదు. భార్య భర్త నుంచి ఖులా పొందాలనుకుంటే, అతను మహర్ తిరిగి తీసుకోవచ్చు (భర్త తన ఉదారతను చాటుతూ భార్య నుంచి ఏమీ తీసుకోకుండానే ఖులా ఇవ్వడమే ఉత్తమం). అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు :

> **"దంపతులిద్దరూ అల్లాహ్ విధించిన హద్దులకు కట్టుబడి ఉండలేరనే భయం మీకు కలిగితే, స్త్రీ తన భర్తకు ఏదైనా పరిహారం ఇచ్చి వేరే కావటానికి వారిద్దరూ అంగీకరిస్తే, అందులో ఏ మాత్రం దోషం లేదు."**
>
> ***(దివ్యఖుర్ఆన్ 2 : 229)***

ఖులాలో భార్యాభర్తల అభీష్టం తప్పనిసరి. భార్య మహర్‌ను క్షమించినా లేదా దాన్ని పొందితే తిరిగి ఇచ్చేసినా లేదా వేరుగా భర్తకు కొంత ధనం ఇచ్చి అతనిని ఖులా కొరకు ఒప్పించినా ఖులా అవుతుంది. తలాకె బాయిన్ పడిపోతుంది. తరువాత వారిద్దరూ మళ్లీ కలసి ఉండాలనుకుంటే మళ్లీ (కొత్త మహర్‌తో) వివాహం చేసుకోవాల్సి ఉంటుంది.

ఖులాలోని ఒక రూపమే 'ముబారాత్'. ఇందులో భార్యాభర్తలు ఎలా విడిపోతారంటే, భర్త భార్యతో నువ్వు నన్ను అన్ని హక్కుల నుంచి విముక్తి కల్పిస్తావనే నిబంధన మేరకు నేను నిన్ను వివాహ బంధం నుంచి వేరు చేస్తున్నాను అంటాడు. దానికి ఆమె నేను నిన్ను విముక్తి చేశాను అంటుంది.

భార్య ప్రతిపాదనపై భర్త ఖులా కోసం ఒప్పుకోకపోతే, ఆమె దారుల్ ఖజాను సంప్రదించి ఖాజీ ద్వారా వివాహ బంధాన్ని తెంచుకునే వీలుంది. దీన్ని 'విడిపోవడం' అంటారు.

తలాక్ అధికారం

షరీఅత్ తలాక్ ఇచ్చే హక్కును భర్తకు కల్పించింది. ఎందుకంటే అతనే వివాహ ఖర్చులను భరిస్తాడు. భార్యకు మహర్ చెల్లిస్తాడు. ఆమె పాలన పోషణను చూసుకుంటాడు. కాని అతను ఈ అధికారాన్ని భార్యకు ఇస్తే, ఉదాహరణకు నేను నీకు తలాక్ తీసుకునే అధికారాన్ని ఇస్తున్నాను అంటే భార్యకు ఆ అధికారం వచ్చేస్తుంది. ఆమె తాను తలచుకున్నప్పుడు తలాక్ తీసుకుని వేరు కావచ్చు. దీనినే 'తలాక్ అధికారం' అంటారు.

ఇద్దత్ (నిర్ణీత గడువు) రూపాలు, ఆదేశాలు

ఇద్దత్ పదానికి అర్థం లెక్కించడం. దీనర్థం షరీఅత్ అదేశాల ప్రకారం వివాహం రద్దు అయిన తరువాత నిరీక్షించే కాలం. ఈ కాలవ్యవధిలో మహిళ రెండో వివాహం చేసుకోజాలదు. ఇద్దత్‌లో మూడు రూపాలున్నాయి. (1) ఆమె ఇద్దత్ మూడు బహిష్టు కాలాలు (అల్ బఖర : 228). ఈ ఆదేశం బహిష్టు వచ్చే మహిళల కోసం. బహిష్టు రాని వారు, లేదా ఏదైనా వ్యాధి వల్ల లేదా వృద్ధాప్యం వల్ల బహిష్టు రావడం ఆగిపోయిన వారి ఇద్దత్ ఖుర్ఆన్‌లో మూడు నెలలుగా పేర్కొనడం జరిగింది (అత్ తలాక్ : 4). (2) భర్త చనిపోయిన భార్య ఇద్దత్ కాలం నాలుగు నెలల పది రోజులు (అల్ బఖర : 234). రెండు రూపాలు కూడా విడాకులు పొందినప్పుడు, భర్త మరణించినప్పుడు గర్భందాల్చని మహిళలకు సంబంధించినవి. (3) గర్భంతో ఉండి విడాకులు తీసుకున్న లేదా వితంతువులుగా మారిన మహిళల ఇద్దత్ కాలం ప్రసవం వరకు. అది భర్త చనిపోయిన తరువాత వెంటనే అయినా లేదా నాలుగు నెలల పది రోజుల కంటే ఎక్కువ రోజులు అయిన తరువాత అయినా సరే. ప్రసవం కాగానే వారి ఇద్దత్ కాలం పూర్తవుతుంది.

ఇద్దత్ మౌలిక ఉద్దేశ్యం భర్త ద్వారా భార్య గర్భం దాల్చిందా లేదా అనే విషయం తెలుసుకోవడమే. ఇద్దత్ కాలంలో భార్యను అత్యవసరం లేనిదే ఇంటి నుంచి బయటికి పంపకూడదు. అదే విధంగా ఆమె అందంగా సింగారించుకో కూడదు. మెరిసే దుస్తులు ధరించకూడదు. ఆ కాలంలో ఎవరైనా వ్యక్తి ఆ మహి ళకు సుస్పష్టంగా వివాహ సందేశం పంపకూడదు. సూత్రప్రాయంగా నికాహ్ ప్రస్తావన చేయాలి. అలంకరించక పోవడమనే ఆదేశం తలాకె బాయిన్, తలాకె ముగల్లజ మరియు భర్త చనిపోయినప్పుడు మాత్రమే. అయితే భార్యకు తలాకె రజ్యీ (స్వీకృత తలాక్) ఇస్తే ఇద్దత్ కాలంలో అలంకరించుకోవచ్చు.

విడాకులు పొందిన స్త్రీ పోషణ ఎలా?

ఇద్దత్ కాలంలో విడాకులు పొందిన మహిళ లేదా వితంతువు భర్త ఇంట్లోనే ఉండాలి. ఇద్దత్ గడిచిన తరువాత ఆమె పోషణ బాధ్యతలను ఆమె దగ్గరి బంధువులు చూసుకోవాలి.

విడాకుల ఫలితంగా స్త్రీకి ఆసరా లేకుండా పోతుందంటుంటారు కొందరు. భార్య కొంత కాలం భర్తతో గడిపింది. భర్త విడాకులు ఇచ్చి ఆమెను తన ఇంటి నుంచి వెళ్లగొడితే ఆమె ఎక్కడికిపోవాలి? శేష జీవితం ఎలా గడపాలి? అంటుంటారు. విడాకులు ఇచ్చిన భార్యకు భర్త జీవితాంతం డబ్బులు ఇచ్చేలా ఆంక్షలు విధించాలి. దాంతో ఆమె తరువాతి జీవితం సాఫీగా సాగుతుంది అంటారు. వాస్తవంగా వీరు ఇస్లామ్ మనోవర్తి వ్యవస్థను పూర్తిగా అర్థం చేసుకోలేదు.

ఖుర్ఆన్‌లో విడాకులు పొందిన మహిళ గురించి 'మతాఅ' అని ఆదేశించడం జరిగింది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

> **"అదేవిధంగా విడాకులివ్వబడిన స్త్రీలకు కూడా సముచితరీతిన ఎంతో కొంత ఇచ్చి సాగనంపాలి. భయభక్తులు కలవారు దీనిని విధిగా పాటిం చాలి."** *(దివ్యఖుర్ఆన్ **2 : 241**)*

'మతాఅ' అంటే నిఘంటువు ప్రకారం 'స్వల్ప వస్తుసామగ్రి' అని అర్థం. దాంతో సమయానుకూలంగా లబ్ధి పొందవచ్చు. ఖుర్ఆన్‌లో దీన్ని నిర్ధారించ లేదు. దీన్ని ఆచారం, సంప్రదాయం కోసం వదలిపెట్టడం జరిగింది. విశ్వాసు లను ప్రోత్సహించడం జరిగింది. వారిలో ఎవరైనా తలాక్ ఇచ్చి భార్య నుంచి తెగతెంపులు చేసుకుంటే, 'ఆమెతో మంచిగా మెలగండి. ఆమెకు ఏదైనా ఇచ్చి సాగనంపండి' అని పేర్కొనడం జరిగింది.

ఇస్లామ్ ధర్మం మహిళను నిస్సహాయ స్థితిలో వదలిపెట్టలేదు. ఆమె పోషణకు ఏర్పాట్లు చేసింది. ఆమె తండ్రి బ్రతికి ఉంటే అతను ఆమె పోషణ బాధ్య తను చేపట్టడం వాజిబ్. అతను మరణిస్తే ఆమె దగ్గరి బంధువులు ఆమె బాధ్యత లను స్వీకరించాల్సి ఉంటుంది. ఉదాహరణకు బాబాయ్ లేదా సోదరుడు తదితరులు ఆమె పోషణ బాధ్యతలు తీసుకోవడం వాజిబ్. ఒకవేళ ఆమెకు ఎవరూ లేకపోతే ముస్లిమ్ సమాజం ఆమెను ఆదుకోవాలి. ఇలాంటి అర్హులకు ప్రాధాన్యతనిస్తూ జకాత్, బైతుల్ మాల్, వక్ఫ్ ఆస్తుల ద్వారా సహాయం అందించాలి.

వివాహం అనేది స్త్రీ పురుషుల మధ్య జీవితంలో సాన్నిహిత్యాన్ని పెంచే ఒక గౌరవప్రదమైన ఒప్పందం. తలాక్ ఈ ఒప్పందం నుంచి విముక్తి పొందుతున్నట్లు ఒక ప్రకటన చేయడం. వివాహం తరవాత భార్యకు భర్త నుంచి ఏ సహాయం అందుతుందో, తలాక్ తరువాత దానిపై ఆమెకు హక్కు ఉండదు. ఇద్దత్ తరువాత కూడా భర్త నుంచి మనోవర్తిని ఇప్పించడం భర్తపై అన్యాయం చేయడమే. అంతే కాకుండా ఇది భార్య ఆత్మగౌరవానికి వ్యతిరేకం. అలాంట ప్పుడు పురుషుడు భార్యకు విడాకులు ఇవ్వకుండా తన వద్దనే అంటిపెట్టించుకుని, వేధించే అవకాశాలే ఎక్కువ.

హజానత్ (పోషణ హక్కు)

విడాకులు పొందిన మహిళ ఖర్చుల సమస్యను హజానత్ అంటే పోషణ

హక్కుతో కూడా పరిష్కరించవచ్చు. ఆ మహిళకు చిన్న పిల్లలు ఉంటే ఆమె వద్దనే ఉండాలి. అబ్బాయి అయితే అతను కొంచెం పెద్దవాడు అయ్యే వరకు అంటే ఏడెనిమిది యేళ్లయ్యే వరకు, అమ్మాయి అయితే ఆమె ప్రాజ్ఞ దశకు చేరే వరకు– ఈ కాలంలో పురుషుడు తన సంతానం ఖర్చులను భరించాల్సి ఉంటుంది. దాంతో పాటే భార్యకు అయ్యే ఖర్చులు కూడా భరించాల్సి ఉంటుంది. ఇది భార్యకు ఇచ్చే మనోవర్తి క్రిందికి రాదు. ఇది పోషణ భత్యం క్రిందికి వస్తుంది. ఆమె తీసుకునేది మాజీ భర్త నుంచి భరణం కాదు తాను చేసిన శ్రమకు ప్రతిఫలం.

స్త్రీకి రెండో వివాహం అయ్యేంత వరకు ఈ పోషణ హక్కు ఉంటుంది. ఆ తరువాత పిల్లల పోషణ బాధ్యత ఆమె ఇతర సమీప బంధువుల (ఉదా: తాతయ్య, నాయనమ్మ, చెల్లి, పిన్ని తదితరుల)పై ఉంటుంది.

ఇస్లామ్‌లో వారసత్వ హక్కులు

ఎవరైనా వ్యక్తి చనిపోతే అతని ఆస్తిపాస్తులు అతని వారసులకు బదిలీ అవడాన్ని వారసత్వం అంటారు. ఖుర్‌ఆన్, హదీసుల్లో దీని ఆదేశాలున్నాయి. ప్రతి వారసుని వాటాను నిర్ధారించడం జరిగింది. వారసత్వంలో స్త్రీ పురుషులు ఇరువురికీ వాటా లభిస్తుంది. వారసత్వ ధనం కొంచెం ఉన్నా, ఎక్కువగా ఉన్నా అన్ని సందర్భాల్లోనూ దాన్ని పంపిణీ చేయడం తప్పనిసరి. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

> **"తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచివెళ్లిన ఆస్తిలో పురుషులకు భాగం ఉంది. అదేవిధంగా తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచి వెళ్లిన ఆస్తిలో స్త్రీలకు కూడా భాగం ఉంది– అది తక్కువైనా సరే లేక ఎక్కువైనా సరే. ఈ భాగం (అల్లాహ్‌చే) నిర్ణయించబడింది."** ***(దివ్యఖుర్‌ఆన్ 4 : 7)***

ఎవరైనా వ్యక్తి చనిపోతే అతను వదలిపెట్టిన ఆస్తిలో నుంచి ఈ క్రింది పనులలో ఖర్చు చేయాల్సి ఉంటుంది.

(1) అన్నిటికంటే ముందు అతని అంత్యక్రియలు చేయాలి.

(2) అతను వీలునామా రాసి ఉంటే దాన్ని అమలు పరచాలి. అతని వీలునామా ఆస్తిలో మూడో వంతు కంటే ఎక్కువగా చేసి ఉండకూడదు, ఏదైనా వారసుని పక్షంలో ఉండకూడదు.

(3) అతనికి ఏవైనా అప్పులు ఉంటే వాటిని చెల్లించాలి.

ఆ తరువాత మిగిలిన ఆస్తిని వారసుల్లో పంపిణీ చేయాలి.

ఇస్లామీయ వారసత్వ చట్టానికి ఆధారం పేదరికమో, వ్యక్తికి ఉండే అవసరాలో కాదు, మృతుని బంధువుల్లో ఎవరు ఎక్కువ అవసరార్థులో వారికి వారసత్వంలో ఎక్కువ వాటా లభించడానికి. దానికి ఆధారం బంధుత్వం. అందులోనూ సమీప బంధుత్వం. బంధువులు చాలా మందే ఉంటారు. కానీ షరీఅత్‌లో కేవలం సమీప బంధువులనే వారసత్వానికి హక్కుదారులుగా పరిగణించడం జరిగింది.

వారసత్వం పంపిణీ విషయంలో ముస్లిమ్ సమాజంలో అత్యంత నిర్లక్ష్యం, నిర్లిప్తత, అలసత్వం చోటుచేసుకున్నాయి. ఎవరైనా వ్యక్తి మరణిస్తే అతని వారసులు, యేళ్లు గడచినా ఆస్తిని పంపిణీ చేయరు. లేదా దాన్ని కొందరు వారసులు మాత్రమే వాడుకుంటుంటారు. ఇతర వారసులు దానికి నోచుకోరు. దాంట్లో నుంచి మృతుని భార్య, ఇతర వృద్ధ వారసుల వాటా తీయరు. వ్యవసాయ భూముల్లో మహిళలకు వాటా ఇవ్వరు. లేదా మహిళలు స్వయంగా తమ సోదరులతో బంధుత్వం ఎక్కడ దూరమవుతుందోనని, తమ పుట్టింటికి వెళ్లడం ఆపాల్సి వస్తుందేమోనని తమ వాటాను వదలుకుంటారు. అంతేకాదు, వివాహ సందర్భంగా అమ్మాయికి ఇచ్చే వరకట్నాన్ని వారసత్వానికి బదులుగా భావిస్తారు. వారసత్వంగా లభించే వాటాకు సమానంగా అమ్మాయిలకు ముందుగానే వరకట్నం రూపంలో ఇచ్చేశామని వివరణలిస్తుంటారు. ఈ పద్ధతులన్నీ సరైనవి కావు. కుర్‌ఆన్‌లో వారసత్వ ఆదేశాలను 'అల్లాహ్ హద్దులు'గా పేర్కొనడం జరిగింది. వాటి ఉల్లంఘనకుగాను నరకాగ్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించడం జరిగింది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

"అల్లాహ్‌కూ ఆయన ప్రవక్తకూ అవిధేయత చూపుతూ అల్లాహ్ విధించిన

హద్దులను అతిక్రమించే వాణ్ని అల్లాహ్ అగ్నిలో పడవేస్తాడు. అందులో అతడు సదా ఉంటాడు. అతనికి మిక్కిలి అవమానకరమైన శిక్ష పడు తుంది" ***(దివ్యఖుర్ఆన్ 4 : 14)***

వారసత్వం విషయంలో గుర్తుంచుకోవాల్సిన మరో విషయం ఏమిటంటే, వారసత్వ సమస్య అనేది మనిషి మరణించిన తరువాత ఉత్పన్నం అవుతుంది. కనుక ఎవరైనా వ్యక్తి జీవించి ఉన్నప్పుడు అతని కుమారులు గానీ, కుమార్తెలు గానీ తమ వాటా ఇవ్వమని కోరడానికి షరీఅత్‌లో ఎలాంటి ఆధారాలు లేవు. ఎవరైనా వ్యక్తి తన జీవిత కాలంలో తన ఆస్తి, ధనాన్ని సంతోషంగా పంపిణీ చేయవచ్చు కాని అది వారసత్వ పంపిణీ అవదు. అది హిబా (కానుక) ఇవ్వడం అవుతుంది. అది అతని అభీష్టంపై ఆధారపడి ఉంటుంది. మనిషి తన జీవితంలో తన ధనానికి యజమాని. అతను దాన్ని తన కోరిక మేరకు ఖర్చుచేసుకుంటాడు. అయితే ఒకవేళ అతను తను సజీవంగా ఉన్నప్పుడు దాన్ని పంపిణీ చేయాలనుకుంటే షరీఅత్ బోధనల ప్రకారం అందరికీ సమానంగా పంచాలి.

వారసత్వంలో కొన్ని సార్లు మహిళల వాటా తగ్గడానికి కారణం

వారసత్వంలోని కొన్ని రూపాల్లో స్త్రీలకు పురుషుల కంటే అధిక వాటా లభిస్తుంది. ఉదాహరణకు ఎవరైనా వ్యక్తి తల్లిదండ్రులు, ఒక కుమార్తెను వదలి మరణిస్తే కూతురికి సగం వాటా లభిస్తుంది. తల్లిదండ్రుల్లో ప్రతి ఒక్కరికి ఆరో భాగం లభిస్తుంది. కొన్ని సందర్భాల్లో స్త్రీపురుషులు ఇరువురికీ సరిసమానంగా వాటా లభిస్తుంది. ఉదాహరణకు, వారసుల్లో భర్త, ఒక సోదరి ఉంటే ఇరువురి మధ్య ఆస్తిని సగం సగం పంపిణీ చేయాల్సి ఉంటుంది. కేవలం కొన్ని సందర్భాల్లోనే స్త్రీ వాటా పురుషుని వాటాలో సగం లభిస్తుంది. ఉదాహరణకు మృతుని సంతానంలో కుమారులు, కుమార్తెలు, సోదరులు, సోదరీమణులు ఉంటే; వారిలో ఈ వ్యత్యాసం స్త్రీ పురుష తేడా ప్రకారం ఉండదు. అలా ఉన్నట్లయితే, కుమారుని కంటే తండ్రివాటా, కుమార్తె కంటే తల్లి వాటా తక్కువగా

ఉండేది కాదు. ఈ వ్యత్యాసానికి మూల కారణం ఇస్లామీయ సామాజిక వ్యవస్థలో స్త్రీ పురుషుల స్థాయి. పురుషునిపై సంపాదించే, ఇల్లు నడిపే, తనతో పాటు ఉండేవారి పోషణ చేసే బాధ్యతలను మోపడం జరిగింది. స్త్రీలను ఆర్థిక బాధ్యతల నుంచి వేరు చేయడం జరిగింది. బాల్యంలో ఆమెను తండ్రి పోషిస్తాడు. వివాహానంతరం భర్త పోషించాల్సి ఉంటుంది. ఆ తరువాత ఆమెను పోషించే బాధ్యత సంతానంపై ఉంటుంది. ఆమె వద్ద ఎంత ఆస్తి ఉంటుందో అది ఆమె వద్దనే సురక్షితంగా ఉంటుంది. ఇతరులపై ఖర్చు చేయడం ఆమె బాధ్యత కాదు. కాని పురుషుడు సంపాదించేదంతా అతని సంరక్షణలో ఉన్న వారిపై ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ విధంగా చూసినట్టయితే పురుషునికి స్త్రీ కంటే రెట్టింపు లభించడం సబబే. ఇద్దరి వాటా సరిసమానం చేస్తే పురుషుని విషయంలో అన్యాయం చేసినట్లవుతుంది.

ఈ కారణంగానే పురుషుని ఆర్థిక బాధ్యతలు తక్కువగా ఉన్న లేదా లేని సందర్భాల్లో ఆస్తి పంపిణీ వ్యవహారంలో స్త్రీ పురుషుల మధ్య వ్యత్యాసం చూపడం జరగదు. ఉదాహరణకు మృతుని సంతానం, అతని తల్లిదండ్రులు ఉన్నట్లయితే, తల్లిదండ్రులు ఇరువురిలో ఒక్కొక్కరికీ ఆరో వంతు నిర్ధారించబడింది. ఎందు కంటే ఏ వ్యక్తి సంతానానికి కూడా సంతానం ఉంటుందో అలాంటి వారిపై ఆర్థిక బాధ్యతలు చాలా వరకు తగ్గుతాయి లేదా అసలుండవు. అతని స్థాయి సాధార ణంగా మనవళ్లు, మనవరాళ్ల సంరక్షకునిగా ఉంటుంది. కాని మృతునికి సంతానం లేకపోతే, అతని తండ్రికి సంతానం(అంటే మృతునికి సోదరుడు లేదా సోదరి) ఉంటే అలాంటి సందర్భంలో(అంటే మృతుని తండ్రి)పై ఆర్థిక బాధ్యత ఉంటుంది. ఈ కారణంగానే తండ్రి వాటా తల్లి వాటా కంటే ఎక్కువ నిర్ణయిం చడం జరిగింది (తల్లికి మూడో వంతు, తండ్రికి రెండో వంతు వాటా లభిస్తుంది).

అనాథ మనవలు, మనవరాళ్ల సంరక్షణ

ఇస్లామీయ వారసత్వ వ్యవస్థపై అభ్యంతరాల్లో ఒక ముఖ్యమైన అభ్యంతరం

ఏమిటంటే, అది అనాథ మనవళ్లు, మనవరాళ్లకు ఏమీ ఇవ్వలేదు అన్నది. ఈ అభ్యంతరం తెలుపుతూ వారి పేదరికం, దీనత్వం, అగత్యాన్ని స్పష్టపరుస్తారు. వారికి గనక వారసత్వంలో వాటా ఇవ్వకపోతే వారు ఆకలిదప్పులతో అలమటిస్తారు, దుర్భరజీవితం గడుపుతారు అనేంతగా ఆరోపణలు చేస్తారు. ఆ తరువాత ఇస్లామీయ షరీఅత్‌ను లక్ష్యంగా చేసుకుని ఇస్లామీయ చట్టాలు దౌర్జన్యపూరితమైనవంటారు. హక్కులను ఉల్లంఘించడం జరిగిందంటారు.

వాస్తవంగా ఇస్లామీయ వారసత్వ చట్టాల్లోని మర్మాలు, ఔచిత్యాల గురించి ఇలాంటి వారికి తెలియదు. అదేవిధంగా అనాథ మనవళ్లు, మనవరాళ్ల పట్ల వారి సానుభూతి కేవలం ప్రదర్శన, మోసం మాత్రమే. అనాథ మనవళ్లు, మనవరాళ్ళకు ఏ మార్గాల ద్వారా సహాయం చేయవచ్చో ఆ మార్గాలపై శ్రద్ధ చూపే కంటే కూడా ఇస్లామ్‌కు విరుద్ధమైన మార్గాల ద్వారా సహాయం చేయడానికి మార్గాలు వెతుకుతుంటారు.

ఇంతకు ముందు చెప్పినట్లు, వారసత్వ పంపిణీకి ఆధారం పేదరికమో, లేదా మనిషి అవసరాలో కాదు, సమీప బంధుత్వం అని. సమీప బంధువులు సజీవంగా ఉన్నపక్షంలో దూరపు బంధువులు కొంత కోల్పోతారు. ఎవరైనా వ్యక్తికి కుమారులు, కుమార్తెలు, మనవళ్లు, మనవరాళ్లు ఉంటే; కుమార్తెలు, కూతుళ్లు సమీపబంధువులు కనుక వారు అర్హులవుతారు. వారు ఉన్నందు వల్ల దూరపు బంధువులకు ఏమీ లభించదు. అందులో మనవళ్లు, మనవరాళ్లు కూడా ఉన్నారు.

వారసత్వ సమస్య అనేది మనిషి మరణించిన తరువాత ఉత్పన్నం అవుతుందే తప్ప సజీవంగా ఉన్నప్పుడు కాదు. మనిషి బ్రతికి ఉన్నప్పుడు అతని కుమారుడు చనిపోతే, ఆ వ్యక్తి చనిపోయినప్పుడు అతను లేకపోతే అతనికి వాటా ఎలా లభిస్తుంది? అతనికి వాటాయే లేకపోతే అతని కుమారుడు ఎలా వాటాకు అర్హుడవుతాడు?

కానీ దీనర్థం ఇస్లామ్ ధర్మం అనాథ మనవళ్లు, మనవరాళ్ళను నిస్సహాయంగా వదిలిందని, వారి పోషణ ఏర్పాటు చేయలేదని కాదు. ఈ క్రింది పద్ధతుల ద్వారా వారి పోషణ చేయాల్సి ఉంటుంది.

(1) బఖర సూరాలోని ఆయత్ నంబర్ 233లోని ఒక చిన్న భాగం: **'అదే విధంగా వారసులపై కూడా వారి బాధ్యత ఉంటుంది'.** అంటే అనాథ బాలుని సంరక్షణ బాధ్యత ఎవరిదంటే, అతని ఆస్తికి అర్హులయ్యే వారే ఆ బాలుని సంరక్షణ బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది. దీని ద్వారా ధార్మిక పండితులు అనాథ మనవలు, మనవరాళ్ల పోషణ బాధ్యత వారి సమీప బంధువులదని నిరూపిస్తారు. ఇతరులు ఏమంటారంటే, తండ్రి ఆస్తికి వారసుడయ్యే బాబాయే తన సోదరుని కుమారులు, కుమార్తెల సంరక్షణ బాధ్యతలను చేపట్టాల్సి ఉంటుంది.

(2) **ఇస్లామీయ షరీఅత్‌లో వీలునామా చట్టం ఉంది. వారసత్వ ఆయత్‌లలో మృతుని అప్పుల చెల్లింపులు, వీలునామా అమలు జరిపిన తరువాతనే వారసత్వ పంపిణీ చేయాల్సి ఉంటుందని అనేకమార్లు పేర్కొంది. *(దివ్యఖుర్ఆన్* 4 : 11)** అనాథ మనవళ్లు, మనవరాళ్ల పక్షంలో వీలునామా వ్రాసి వారి అవసరాలు తీర్చే అవకాశం ఉంది. ఒక వ్యక్తి బ్రతికి ఉండగానే కొడుకు చనిపోతే తన మనవలు, మనవరాళ్ల కోసం అవసరానికను గుణంగా తాను మరణించిన తరువాత వారికి వారసత్వం లభించనందు వల్ల నిస్సహాయులు కాకుండా ఉండడానికి తన ధనంలోని మూడో వంతులో వారి కోసం వీలునామా రాయవచ్చు.

(3) ఖుర్ఆన్‌లో వారసులకు ఒక హితోపదేశం ఇవ్వడం జరిగింది; వారసత్వ ఆస్తి పంపిణీ చేస్తున్నప్పుడు షరీఅత్ రీత్యా వాటా లభించని బంధువులకు కూడా ఎంతో కొంత ఇవ్వాలి. *(దివ్యఖుర్ఆన్* 4 : 8) ఈ ఆయత్ ద్వారా స్పష్టమవుతున్నదేమిటంటే, వారసులు వారసత్వంలో వాటా లభించని

తమ బంధులను కూడా పట్టించుకోవాలి. అవసరాల నిమిత్తం వారిని ఆర్థికంగా ఆదుకోవాలి.

(4) ఖుర్‌ఆన్‌లో బంధుత్వ సంబంధాలను నిర్వర్తించమని తాకీదు చేయడం జరిగింది. బంధుత్వ విచ్ఛిత్తికి పాల్పడడాన్ని వారించడం జరిగింది. అనాథ మనవలు, మనవరాళ్లు బంధుత్వ సంబంధాలు పెంచేందుకు అర్హులు. వారి బంధువులు వారిని పట్టించుకుంటే, అవసరం వచ్చినప్పుడు వారిని ఆర్థికంగా ఆదుకుంటే వారు కూడా ఎలాంటి సమస్యల బారిన పడరు.

ఇస్లామీయ వారసత్వ వ్యవస్థపై అభ్యంతరాలు రేపేవారు వారసత్వంలో వాటా పొందలేకపోతున్న అనాథ మనవలు, మనవరాళ్ల సమస్యను ఎలా లేవనెత్తుతారంటే, ఎప్పుడూ తాతయ్యలు ధనవంతులుగా ఉంటారు, మనవలు, మనవరాళ్లు పేదలు, అభాగ్యులు, నిస్సహాయులుగా ఉంటారు. ఈ రెండు విషయాలు పూర్తిగా సరైనవి కావు. అనేక సందర్భాల్లో తాతయ్యలు పేదలుగా, తన కొడుకులపై ఆధారపడి జీవిస్తుంటారు. మరి కొన్ని సందర్భాల్లో మనవళ్లకు ఎలాంటి ఆర్థిక అవసరాలు ఉండవు. ఎందుకంటే వారికి తమ తండ్రి నుంచి భారీ మొత్తంలో ధనసంపదలు లభించి ఉండవచ్చు,

దత్తత

ముస్లిముల కౌటుంబిక చట్టాలలో ఒక అంశం 'దత్తత'కు సంబంధించింది. దీని భావం ఏమిటంటే, ఎవరినైనా తన కుమారునిగా చేసుకోవడం. దత్తత తీసుకున్న వారిని 'దత్త పుత్రులు' అంటారు. ఎవరైనా వ్యక్తి ఒక అబ్బాయిని గానీ, అమ్మాయిని గానీ పోషణ బాధ్యత తీసుకుని వారిని సంరక్షించి, విద్యాశిక్షణ ఇచ్చి, వివాహం చేస్తే ఇది పుణ్యకార్యమని ఇస్లామ్ ధర్మం పేర్కొంది. సంరక్షణలో ఉన్న అమ్మాయి లేదా అబ్బాయి అనాథ అయినట్లయితే వారిని పోషించినందుకు మరింత పుణ్యఫలం ప్రాప్తిస్తుందని ప్రవక్త (స) పేర్కొన్నారు. ప్రవక్త (స) ఒక సారి తన రెండు వ్రేళ్ల వైపు సైగ చేస్తూ ఇలా అన్నారు: **'నేను మరియు అనాథను**

పోషించేవాడు ఇద్దరూ స్వర్గంలో ఇలా ఉంటాం అని తన రెండు వ్రేళ్లను కలిపి చూపించారు'. (బుఖారీ: 5304) మరో వాస్తవం ఏమిటంటే, ఇస్లామ్ ధర్మం వంశరక్షణకు ప్రాధాన్యత నిస్తుంది. ఇతరుల సంతానాన్ని తన సొంత సంతానం స్థాయి కల్పించడం, వారి సంబంధాన్ని తనతో జోడించుకోవడం ఎలాంటి పరిస్థితిలోనూ సమ్మతం కాదు. అలా చేయడాన్ని ఖుర్ఆన్ చాలా స్పష్టంగా వారించింది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

> **"ఆయన మీ దత్త పుత్రులను మీ సొంత పుత్రులుగా చేయలేదు. ఇవి మీరు పలికే మీ నోటి మాటలు మాత్రమే. కాని అల్లాహ్ మాత్రం సత్యం పునాదిగా ఉన్న మాటనే అంటున్నాడు. ఆయనే సరైన విధానం వైపునకు మార్గం చూపుతున్నాడు. దత్తపుత్రులను వారి తండ్రులతో ఉన్న సంబంధం ప్రకారం పిలవండి. ఇది అల్లాహ్ దృష్టిలో ఎంతో న్యాయసమ్మతమైన విషయం."** ***(దివ్యఖుర్ఆన్ 33 : 4,5)***

దత్త సంతానానికి వాస్తవ సంతానం స్థాయి కల్పిస్తే ఇస్లామ్‌లోని ఇతర చట్టాలపై దాని ప్రభావం పడుతుంది. ఉదాహరణకు ఒక వేళ భార్యాభర్తలకు సంతానం కలగకపోతే ఆస్తిలో వారికి నిర్ధారించబడిన వాటా కంటే వారికి సంతానం కలిగితే వచ్చే వాటా తక్కువగా ఉంటుంది. అదేవిధంగా ఎవరైనా వ్యక్తికి సంతానం కలగనిపక్షంలో అతని కొందరు బంధువులు వారసత్వంలో వాటా పొందుతారు. అదేగనక అతనికి సంతానం కలిగితే బంధు వులు ఆ వాటాకు నోచుకోరు. ఉదాహరణకు సోదరికి సంతానం కలగకపోతే సోదరుడు దానికి వారసుడౌతాడు. దాని ప్రభావం ఇస్లామ్ వివాహ చట్ట వ్యవస్థపై కూడా పడుతుంది. దీని ఫలితంగా వాస్తవ సంతానానికి ఏ ఏ సంబంధాలు నిషేధం అవుతాయో దత్త సంతానానికి కూడా ఆ సంబంధాలు నిషేధం అవుతాయి.

ఈ కారణాల మూలంగానే భారత ప్రభుత్వం 1972లో దత్త సంతానం చట్టాన్ని ప్రవేశపెట్టింది. దీన్ని ముస్లిమ్ సమాజానికీ అన్వయించారు. ముస్లిములు దీన్ని వ్యతిరేకించారు. తీవ్ర నిరసనలు చేపట్టారు.

ముస్లిమ్ పర్సనల్ లా అమలు ఎందుకు తప్పనిసరి?

ఇస్లామ్ ధర్మం విశ్వాసులతో కోరేదేమిటంటే, జీవితంలోని అన్ని వ్యవహారాల్లో నిరభ్యంతరంగా అల్లాహ్‌కు, ఆయన ప్రవక్త (స)కు విధేయత చూపాలి. వారు ఆదేశించిన వాటిని శిరసావహించాలి. వారించిన వాటికి దూరంగా ఉండాలి. కుటుంబ జీవితం కూడా ఈ పరిధిలోకే వస్తుంది. దైవాదేశాలను పాటించే వారిని సాఫల్యం పొందిన వారుగా పేర్కొంది ఖుర్‌ఆన్. అల్లాహ్ ఇలా సెలవిస్తు న్నాడు:

"విశ్వసించే వారి పని ఏమిటంటే, తమ వ్యాజ్యాన్ని దైవప్రవక్త పరిష్కరించే విషయంలో వారు అల్లాహ్ వైపునకూ, దైవప్రవక్త వైపునకూ పిలువబడితే, 'మేము విన్నాము, విధేయత చూపాము' అని అనాలి. అటువంటి వారే సాఫల్యం పొందుతారు." *(దివ్యఖుర్‌ఆన్ 24 : 51, 52)*

విశ్వాసులతో అది ఇంకేం కోరుతుందంటే, వారి మధ్యన ఏదైనా వ్యవహారంలో భేదాభిప్రాయాలు లేదా వివాదం తలెత్తితే దాన్ని అల్లాహ్, ఆయన ప్రవక్త (స) బోధనల అంటే ఖుర్‌ఆన్, హదీసుల వెలుగులో పరిష్కరించడానికి ప్రయత్నించాలి. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

"మీ మధ్య ఏ విషయంలోనైనా వివాదం తలెత్తితే దాన్ని అల్లాహ్‌కు, ప్రవక్తకు నివేదించండి. మీరు నిజంగానే అల్లాహ్ మీద అంతిమ దినం మీదా విశ్వాసం కలవారే అయితే". *(దివ్యఖుర్‌ఆన్ 4 : 59)*

విశ్వాసులు తమ భేదాభిప్రాయాల వ్యవహారాల్లో ఖుర్‌ఆన్, హదీసులను మధ్యవర్తిని చేయకపోతే, తమ మనోవాంఛల ప్రకారం పరిష్కరించేందుకు ప్రయత్నిస్తే లేదా మానవులు చేసిన చట్టాల సహాయం పొందితే వారి విశ్వాసం ప్రామాణికం కాదు. కొందరు తాము విశ్వాసులమని వాదిస్తారు కానీ తమ పరస్పర వ్యవహారాలను అల్లాహ్, ఆయన ప్రవక్త ఆదేశాల వెలుగులో పరిష్కరించకుండా ఇతరుల వైపు మళ్ళుతారు. వారి తీర్పులను స్వీకరిస్తారు. కుర్‌ఆన్ దీన్ని తీవ్రంగా ఖండించింది. ఇలాంటి ఆచరణను తిరస్కార ధోరణి, దౌర్జన్య పూరితమైన వైఖరిగా అభివర్ణించింది *(దివ్యఖుర్‌ఆన్ 5 : 44, 45, 46)*. కనుక

ముస్లిములు పర్సనల్ లా లోకి వచ్చే చట్టాలను ఆచరించడం తప్పనిసరి చేసుకోవాలి. పరస్పరం విభేదాలు వచ్చినప్పుడు వాటిని వదలిపెట్టి ఇతర చట్టాల వైపునకు మళ్ళకూడదు.

ప్రస్తుత పరిస్థితుల సున్నితత్వం, మన బాధ్యతలు

భారతీయ ముస్లిములకు ప్రస్తుత పరిస్థితులు చాలా సున్నితమైనవి. ఒకవైపు న్యాయస్థానాల నుంచి సందర్భానుసారం షరీఅత్ వ్యతిరేక తీర్పులు వెలువడుతుంటే, మరో వైపు ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతి ప్రవేశపెట్టాలని ప్రతిపాదిస్తోంది. ప్రభుత్వం దీనికి సంబంధించి తన అభిప్రాయం కూడా వెల్లడించింది. ఇంకో వైపు మతతత్వ శక్తులు ముస్లిమ్ మహిళల ఉదంతాలను పేర్కొంటూ ముస్లిమ్ పర్సనల్ లాను తొలగించాలని కోరుతున్నారు. ముస్లిముల లోని ఒక అభ్యుదయ వాద వర్గం ఇస్లామ్‌లోని కుటుంబిక చట్టాలలో సవరణలు, సంస్కరణలు తీసుకు రావాలంటుంది. వివాహం, విడాకులు, వారసత్వం లాంటి ఇస్లామీయ చట్టాలను ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మార్చాల్సిన అవసరం ఉందని తన వివరణల ద్వారా వాదిస్తోంది. కాని ఖుర్ఆన్ ఆదేశాలకు ఊహాగానాలు, ఏకాభిప్రాయాలతో సంబంధం లేదు. అవి కుర్ఆన్, సున్నత్‌ల ద్వారా రూఢీ అయ్యాయి. వీటిలో ఎలాంటి మార్పు చేర్పులకు ఆస్కారం లేదు.

ఈ సున్నిత పరిస్థితిలో మన బాధ్యత ఏమిటంటే, మనం ఇస్లామ్ శత్రువుల కుట్రలను విఫలం చేయడానికి కృషి చేయాలి. తద్వారా జీవితంలోని అన్ని రంగాలలో ముఖ్యంగా కుటుంబ జీవితంలో ఇస్లామీయ బోధనలు, ఆదేశాలను సులభంగా ఆచరించగలుగుతాము. దీని కోసం మనం మూడు పనులు చేయాల్సి ఉంటుంది.

మొదటిది, మనం మన సంస్కరణకు, సమాజ సంస్కరణకు కృషి చేయాలి. సమాజంలో చాలా మందికి ఇస్లామీయ ప్రాథమిక సాంఘిక బోధనలు తెలియవు. కుటుంబ సభ్యులు, భార్య, భర్త, సంతానం, తల్లిదండ్రులు, ఇతర బంధువులు సక్రమంగా పరస్పర హక్కులను నిర్వర్తించరు. దాని మూలంగా వారి మధ్య

భేదాభిప్రాయాలు తలెత్తుతాయి. వివాదాలు రేగుతాయి. మనం జీవితంలోని అన్ని వ్యవహారాల్లో ఇస్లామీయ బోధనలు తెలుసుకోవాల్సిన, మనస్సును వాటి ఆచరణ వైపు మళ్లించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అల్లాహ్ అవిధేయతకు దూరంగా ఉండాలి. ఇతరుల హక్కులను హృదయ పూర్వకంగా నిర్వర్తించాలి. దీని కోసం ఫ్యామిలీ కౌన్సిల్ సెంటర్స్ ఏర్పాటు చేసి సరిగ్గా దిశా నిర్దేశం చేయాలి.

రెండోది, మన మధ్యన కుటుంబ లేదా ఇతర వ్యవహారాలలో వివాదాలు వస్తే వాటి పరిష్కారం కోసం న్యాయస్థానాలకు వెళ్లకుండా దారుల్ ఖజా, షరీఅత్ పంచాయతీలను సంప్రదించాలని గట్టిగా నిర్ణయించుకోవాలి. అక్కడ అల్లాహ్, ఆయన ప్రవక్త చూపిన ఆదేశాలు, బోధనల ప్రకారం ఇచ్చే తీర్పులను స్వీకరించ డానికి సిద్ధంగా ఉండాలి. దేశంలో మూలమూలలా దారుల్ ఖజా, షరీఅత్ పంచాయతీలను నెలకొల్పేందుకు ముస్లిమ్ నేతలు కృషి చేయాలి.

మూడోది, మనం ఇస్లామీయ కుటుంబ చట్టాల ప్రాధాన్యతను ప్రభుత్వా నికి, దేశ సోదరులకు తెలిపి, వారిలో ఉన్న అపోహలను తొలగించాలి.

ముస్లిమ్ మహిళల సమస్యలు - పరిష్కారాలు

విషయసూచిక

1.	ఇస్లామ్ వ్యతిరేకుల అభ్యంతరాలు	43
2.	ముస్లిమ్ సమాజంలో లోపాలు	44
3.	ఇస్లామీయ కుటుంబం	44
4.	సరళమైన నికాహ్	44
5.	కుటుంబ వివాదాలు, కారణాలు	48
6.	వివాదాలను పరిష్కరించుకునే పద్ధతులు	51
7.	తలాక్ ఇవ్వడంలో అనుచితమైన పద్ధతి- దానివల్ల నష్టాలు	51
8.	బహుభార్యత్వం	54
9.	మహిళల ఆస్తి హక్కు	54
10.	మనం చేయవలసిన పనులు	55

అనంతకరుణామయుడు అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

ఇస్లామ్ ఒక సంపూర్ణమైన జీవన వ్యవస్థ. సమస్త జీవన రంగాలన్నింటికి సంబంధించినది. జీవనరంగాలన్నింటిలో సమస్యలన్నింటికి తగిన పరిష్కారం సూచిస్తుంది. ఎందుకంటే ఇస్లామీయ బోధనలు మనిషి చేసిన బోధనలు కావు. మనిషిని సృష్టించిన విశ్వప్రభువు అందజేసిన బోధనలు. ఆయన యావత్తు విశ్వానికి ప్రభువు. ఆయనే స్త్రీ పురుషులందరినీ సృష్టించాడు. జీవితం గడిపే చట్టాలన్నింటిని ఆకాశ గ్రంథాల ద్వారా మనిషికి అందజేశాడు. తన ప్రవక్తల ద్వారా వాటిని ఆచరించే పద్ధతి నేర్పాడు. ఈ దైవిక చట్టాలు మానవస్వభావానికి అనుగుణమైనవి, మనిషి ప్రవృత్తికి అనుగుణంగా మానవ పురోభివృద్ధి, ప్రగతి వికాసాలకు తోడ్పడేవి.

స్త్రీ పురుషుల మధ్య నికాహ్ ద్వారా పవిత్రమైన సంబంధం ఏర్పడుతుంది. ఒక కుటుంబం ఏర్పడుతుంది. అనేక కుటుంబాలు కలిసి ఒక సమాజం ఏర్పడుతుంది. ఈ సమాజం ఎలాంటి చట్టాల ప్రకారం జీవితం గడపాలన్న ప్రశ్న తలెత్తుతుంది. ఎలాంటి నియమనిబంధనలు పాటించాలన్న ప్రశ్న వస్తుంది. ప్రతి వ్యక్తి హక్కులు బాధ్యతల మధ్య సమతూకం ఉండే నియమనిబంధనలు అవసరమవుతాయి. ఈ నియమనిబంధనలనే కౌటుంబిక వ్యవస్థ అంటారు. ఈ కుటుంబ వ్యవస్థ స్త్రీ పురుషుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి, పవిత్రమైన సమాజం ఏర్పడడానికి, ఉన్నత నాగరికత రూపొందడానికి అవసరమైనది.

1. ఇస్లామ్ వ్యతిరేకుల అభ్యంతరాలు

మనదేశంలో చాలా మందికి ఇస్లామ్ గురించి అవగాహన లేదు. ఇస్లామ్‌లోని కౌటుంబిక వ్యవస్థ స్త్రీలను అణిచేస్తుందన్న అభిప్రాయం కనబడుతోంది. ఇస్లామీయ బోధనలకు సంబంధించిన అవగాహన లేనందువల్ల కొందరు మేధావులు అపోహలు, అపార్థాల్లో ఉంటారు. మరికొందరు కావాలని, ఉద్దేశ్యపూర్వకంగా అభ్యంతరాలు వెలిబుచ్చుతుంటారు.

ఇస్లామీయ కౌటుంబిక వ్యవస్థ గురించి తరచు అభ్యంతరాలు వినవస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం ట్రిపుల్ తలాక్, బహుభార్యత్వం, హలాలా వంటి

విషయాలపై దేశంలో మీడియా ద్వారా అపార్థాలు, అపోహలు ప్రచారం చేసే కార్యక్రమం నడుస్తోంది. ఇస్లామ్‌లో ముస్లిమ్ మహిళలకు సమాన హక్కులు లేవని నమ్మించే ప్రయత్నం జరుగుతోంది. మరోవైపు, ఇస్లామీయ బోధనల అవగాహన లేని కొందరు ముస్లిమ్ మహిళలు ట్రిపుల్ తలాక్, బహుభార్యత్వాలను నిషేధించాలంటూ కోర్టుల్లో కేసులు వేస్తున్నారు.

2. ముస్లిమ్ సమాజంలో లోపాలు

ఇస్లామీయ కుటుంబవ్యవస్థపై అభ్యంతరాలకు ముఖ్యమైన కారణం ప్రస్తుతం ముస్లిమ్ సమాజంలో చోటు చేసుకున్న లోపాలే. ముస్లిములు ధర్మానికి దూరం కావడం, ధార్మిక అజ్ఞానం వల్ల అనేక చెడులు సమాజంలో వ్యాపించాయి. ఉదాహరణకు నికాహ్‌ను తేలికగా, సునాయాసంగా నిర్వహించే బదులు, అనవసరపు ఖర్చులతో, అర్థం లేని ఆచారాలతో నికాహ్ చాలా కఠినమైనదిగా, ఖర్చుతో కూడుకున్నదిగా మార్చేశారు. చాలా చిన్న కారణాలతో దాంపత్య జీవితంలో పొరపొచ్చలు, వివాదాలు తలెత్తు తున్నాయి. ఇవి పెరిగి పెద్దవై చివరకు పురుషుడు ఒకేసారి మూడు తలాక్‌లు ఇచ్చేస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా కొన్ని క్షణాల్లో చక్కని కాపురం కుప్పకూలిపోతోంది. పిల్లలను తల్లిదండ్రులు పంచుకుంటున్నారు. ఇస్లామ్ మహిళలకు ఆస్తి హక్కు ఇచ్చినప్పటికీ వారసత్వ ఆస్తిలో ఆమె హక్కు తగ్గించే ప్రయత్నాలు చేస్తుంటారు. ఆమెకు తల్లిదండ్రులు, ఇతర సన్నిహిత బంధువుల ఆస్తిలో భాగం ఇచ్చే విషయంలో చాలా బాధపడిపోతుంటారు. దివ్యఖుర్ఆన్ స్పష్టంగా చెప్పిన హక్కుల్లో స్త్రీల ఆస్తి హక్కు కూడా ఒకటి.

3. ఇస్లామీయ కుటుంబం

ఇస్లామీయ కుటుంబ వ్యవస్థ మానవాళికి కారుణ్యం వంటిది. ఇస్లామీయ కుటుంబంలో ప్రతి వ్యక్తి తన పాత్రను చక్కగా నిర్వర్తిస్తాడు. పరస్పరం ఒకరి హక్కులు మరొకరు గుర్తించి గౌరవిస్తారు. కుటుంబంలో అందరికీ సమానావకాశాలు లభిస్తాయి. కుటుంబంలో సభ్యుల సంఖ్య, నివాసవసతి దృష్ట్యా కుటుంబాలు చిన్నవి పెద్దవి ఉంటాయి. ఉమ్మడి కుటుంబాలు ఉండవచ్చు.

చిన్న కుటుంబాలు ఉండవచ్చు. క్లుప్తంగా చెప్పాలంటే కుటుంబంలో మనిషి తన భార్యాపిల్లలతో కలిసి ఉంటాడు. కొన్ని కుటుంబాల్లో తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు కూడా ఉండవచ్చు. ఉమ్మడి కుటుంబాల్లో తల్లిదండ్రులు వారి కొడుకులు కోడళ్ళు వారి పిల్లలంతా కలిసి ఉంటారు.

ఇస్లామీయ బోధనల ప్రకారం కుటుంబ పెద్ద పురుషుడు. స్త్రీ తన భర్త ఇంటికి, పిల్లలకు పర్యవేక్షకురాలు. ఈ విషయమై ఆమె జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. అంటే మహిళ ఇంటికి నిర్వాహకురాలు. ఇంటిలో ఏమైనా అల్లాహ్ ఆదేశాలకు విరుద్ధంగా జరుగుతుంటే, ప్రవక్త ఆదేశాలకు వ్యతిరేకంగా ఇంట్లో ఏమైనా జరుగుతుంటే దాన్ని ఆపవలసిన బాధ్యత ఆమెపై ఉంది. ఆమె నిజమైన ముస్లిము అయినప్పుడే ఈ పని చేయగలదు. నేడు సమాజంలో చోటు చేసుకున్న ఇస్లామేతర ఆచారాలు నిజానికి మహిళలకు ధర్మం గురించి అవగాహన లేనందువల్ల వ్యాపించాయి. తన ఇంట్లో ఏం జరిగినా అది ఖచ్చితంగా ఇస్లామీయ బోధనల ప్రకారం జరగాలని మహిళ సంకల్పించుకుంటే ఆమె కుటుంబాన్ని ఆదర్శ కుటుంబంగా తీర్చి దిద్దగలదు.

4. సరళమైన నికాహ్

అమ్మాయి పెళ్ళి చేస్తున్నప్పుడు ఆమెకు కాబోయే వరుడు ధార్మికభావాలు కలిగిన వాడా కాదా అన్నది ముఖ్యంగా చూడాలి. అంతేకాని, బ్యాంకు బేలన్సు, ఆస్తిపాస్తులు కాదు. వరుడి నైతిక ప్రవర్తన, నడవడి, వ్యక్తిత్వం, మంచి అలవాట్లు, విశాల హృదయం, సహన స్థయిర్యాలు ఉన్నవాడా కాదా అన్నది చూడాలి. ఈ లక్షణాల ద్వారా జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కునే సామర్థ్యం ఉందో లేదో, ఇంట్లో సుఖసంతోషాల వాతావరణం ఏర్పరిచే మనిషి అవునో కాదో చూడాలి.

అదే విధంగా వధువును ఎంపిక చేసుకునేటప్పుడు కూడా ఈ ప్రమాణాలే ముఖ్యమైనవి. ఆస్తిపాస్తులు, అందచందాలు, వంశప్రతిష్ఠ వగైరాలను ప్రమాణంగా చేసుకుని పెళ్ళి చేయడం మంచిది కాదు. నడవడి, గుణగణాలు, ధార్మికత, అలవాట్లు వగైరాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు:

"స్త్రీని నాలుగు ప్రాతిపదికలపై పెళ్ళి చేసుకుంటారు. ఆమె ఐశ్వర్యాన్ని చూసి, ఆమె వంశ ప్రాశస్త్యాన్ని చూసి, ఆమె అందచందాలు చూసి, ఆమె ధార్మిక స్థితిని చూసి. మీరు ధార్మికురాలైన స్త్రీనే ఎన్నుకొనండి- మీకు మేలు కలుగుతుంది." ***(బుఖారి, ముస్లిమ్)***

ప్రవక్త ముహమ్మద్ (స) ఈ మాటలు ఎందుకు చెప్పారంటే, పెళ్ళి సందర్భంగా తీసుకునే సరయిన నిర్ణయం తర్వాతి భవిష్యత్తు చక్కగా ఉండడానికి కారణమవు తుంది. గుణవంతులు, యోగ్యులు అయిన సంతానం తల్లిదండ్రుల కంటికి చలువ వంటిది. కుటుంబ సభ్యుల నిరంతర పుణ్యాలకు కారణమవుతుంది. వధూవరుల ఎంపిక తర్వాత వివాహం (నికాహ్) చాలా నిరాడంబరంగా జరపాలని చెప్పడం జరిగింది. కాని ప్రస్తుత సమాజంలో ధనికులైనా, పేదలైనా పెళ్ళిళ్ళలో భారీగా ఖర్చు పెడుతున్నారు. ప్రవక్త ముహమ్మద్ (స) స్పష్టంగా "తక్కువ ఖర్చుతో జరిగిన వివాహమే చాలా శుభప్రదమైనది" అన్నారు. కాని ఇప్పుడు ఆడంబరంగా, భారీ ఖర్చులతో, ఆర్భాటంగా, అట్టహాసంగా పెళ్ళి చేయడమే గొప్పగా భావిస్తున్నారు. పైగా ఎంతో సమయం కూడా వ్యర్థమవుతుంటుంది. మరోమాటలో చెప్పాలంటే అనుచితమైన కోరికలు, డిమాండ్లను తీర్చుకునే సాధనంగా నికాహ్‌ను మార్చేశారు. అందువల్ల రకరకాల ఆచారాలు, వ్యవహారాలు, సంప్రదాయాలు కనిపెట్టారు. మంగ్నీ, సలామీ, శుభలేఖ, జూతా చురాయి, మూఁ దిఖాయీ.. వగైరా. చివరకు ఊరేగింపుగా వచ్చే బారాత్ కూడా నికాహ్‌లో చాలా ముఖ్యమైన అంశంగా భావిస్తున్నారు. వరుడు ఊరేగింపుగా రావాలి, కాబట్టి వరుడి తరఫు వారు ఖరీదైన కారు ఊరేగింపుకు కావాలంటారు. వధువు తల్లిదండ్రులపై భారం వేస్తారు. ఒక్కోసారి వధువు తల్లిదండ్రులు తమ గొప్ప కోసం వరుడు బారాత్ (ఊరేగింపు) రావాలంటారు. అందుకోసం అట్టహాసంగా ఖరీదైన వాహనం సమకూరుస్తారు. నిజం చెప్పాలంటే ఈ బారాత్ వగైరా ఆచారాలేవీ ఇస్లాంలో లేవు. ఈ ఆచారాలు ఒకరి సొమ్మును మరొకరు అక్రమంగా అన్యాయంగా ఖర్చు చేయడంతో సమానమే. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"మీలో మీరు ఒకరి ఆస్తిని మరొకరు అన్యాయంగా కబళించకండి"
(దివ్యఖుర్‌ఆన్ 2 : 188)

మరో దురాచారం జహేజ్ లేదా వరకట్నం.

ఇంట్లో ఆడపిల్ల పుట్టిన మరుక్షణం నుంచి తల్లిదండ్రులు తమ గౌరవ ప్రతిష్టలు, కూతురి ప్రాణాలు కాపాడుకోడానికి వరకట్నం కోసం ఏర్పాట్లలో మునిగిపోయే పరిస్థితి ఉంది. ఈ వరకట్నం ఎంతో మంది అమ్మాయిల ప్రాణాలు తీసింది. దురదృష్టమేమంటే వరకట్నం కోసం పట్టుబట్టే వారిలో మహిళల పట్టింపులే ఎక్కువ. కట్నం తక్కువ తెచ్చిన వధువు జీవితం దుర్భరం చేస్తారు. ఆమె నిలబడినా, కూర్చున్నా ఎత్తిపొడుపులు, వేధింపులతో ప్రాణాలు తీస్తారు. కాని వరుడు ఆమెకు చెల్లించవలసిన మహర్ విషయంలో వీలయినంత తాత్సారం చేస్తుంటారు. నిజానికి మహర్ తప్పని సరిగా చెల్లించవలసింది.

"స్త్రీలకు వారి మహర్‌ను సంతోషంగా చెల్లించండి" *(దివ్యఖుర్‌ఆన్ 4 : 4)*

పెళ్ళి సందర్భంగా జోడేకి రఖమ్ వగైరా, జోడా ఘోడా వ్యవహారాలన్నీ ముందే నిర్ణయిస్తారు, ఈ విషయాలపై చాలా ఖచ్చితంగా మాట్లాడుకుంటారు. కాని తప్పనిసరిగా చెల్లించవలసిన, దేవుడు ఆదేశించిన మహర్ విషయంలో మాత్రం లాంఛనంగా అయ్యిందనిపిస్తారు. మహర్ నామకార్థంగా ఎంతోకొంత నిర్ణయించడం చేస్తారు. చాలా తక్కువగా మహర్ నిర్ణయిస్తారు. లేదా గొప్ప కోసం చాలా ఎక్కువ నిర్ణయిస్తారు. కాని చెల్లించాలన్న నిజాయితీ ఉండదు. తర్వాత వధువుతో రద్దు చేయించుకోవచ్చున్న అభిప్రాయంతో చేస్తుంటారు.

మహర్ ముఅజ్జల్ అంటే నికాహ్ జరిగిన వెంటనే చెల్లించడం చాలా ఉత్తమమని ఇస్లామ్ బోధిస్తోంది. కాని దురదృష్టమేమంటే వరుడు ఎవరైనా నికాహ్ సందర్భంగానే మహర్ చెల్లించాలని భావిస్తే సమాజం అనుమానంగా చూస్తుంది. అతని ఉద్దేశ్యాలు సరిగా లేవని, భార్యను వదిలేయాలని లేదా మరో పెళ్ళి చేసుకోవాలని భావిస్తున్నాడని ఇలా ఏవేవో ఊహాగానాలు మొదలవుతాయి.

5. కుటుంబ వివాదాలు, కారణాలు

ఒకమ్మాయి వివాహం చేసుకుని అత్తగారింట్లో అడుగుపెట్టిన తర్వాత భర్తతో పాటు భర్త కుటుంబంలోని ఇతర సభ్యులతో పాటు కూడా కలసిమెలసి ఉండవలసి ఉంటుంది. ఇంట్లో అత్తగారు, మామగారు, ఆడపడుచు, తోడికోడళు వగైరా సభ్యులుంటారు. ఇందులో అత్యంత ముఖ్యమైన బంధుత్వం, చాలా సున్నితమైన బంధుత్వం అత్తాకోడళ్ళది. ప్రారంభం నుంచి ఈ బంధుత్వంలో ఒక ఒత్తిడి ఉంటుంది. ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంటుంది. దీనికి ముఖ్యమైన కారణమేమంటే అత్తా కోడళ్ళిద్దరూ ఒకే వ్యక్తితో అత్యంత సన్నిహితమైన సంబంధం కలిగి ఉంటారు. వారిద్దరికీ ఆ వ్యక్తి పట్ల కొన్ని ఆశలు, ఆకాంక్షలు ఉంటాయి. ఆ వ్యక్తికి ఒకవైపు అతను అత్యంత ప్రేమించే తల్లి ఉంటుంది. మరోవైపు తల్లిదండ్రులను వదిలి తనతో కాపురానికి వచ్చిన కట్టుకున్న భార్య పట్ల అతని ప్రేమ ఉంటుంది. అత్తగారింటికి వచ్చిన కోడలు తన భర్త తన సంతోషం కోసం ఏమైనా చేస్తాడని అనుకుంటుంది. ఇక్కడ మరో విషయం గమనించవలసినదేమంటే, అత్తగారు ఒకప్పుడు కోడలిగా అనుభవించిన రోజులు ఆమె జ్ఞాపకాల్లో ఉంటాయి. ఆమె మాటమాటకు తన కాలంలో ఎలా ఉండేదో ఇప్పుడు కోడలికి ఎంత గొప్పగా ఉందో గుర్తు చేస్తూ ఉంటుంది. తన కాలంతో పోల్చుతూ ఉంటుంది. వివాదాలు, ఘర్షణలకు మరో కారణం నిర్ణయాధికారాలకు సంబంధించి చింది. కోడలు తాను చెప్పినట్లు నడుచుకోవాలని అత్తకు ఉంటుంది. ఎక్కడికి వెళ్ళాలన్నా, ఏం తినాలన్నా, ఎలాంటి దుస్తులు ధరించాలన్నా తనను అడిగి చేయాలని భావిస్తుంది. మరోవైపు కోడలు తన జీవితంలో అత్త అనవసర జోక్యాన్ని నిరసిస్తుంది. కుటుంబాల్లో వివాదాలకు ఇంకో కారణం అనవసరపు అనుమానాలు, భయాలు కూడా ఉంటాయి. తన కొడుకు సంపాదన, ఇంట్లో వస్తువులన్నీ తన పుట్టింటికి కోడలు తరలిస్తుందేమో అన్న అనుమానాలు అత్తకు ఉంటాయి. అందువల్ల కోడలిని అనుమానంగా చూస్తుంటుంది.

పెద్ద చదువులు చదివిన కోడలికైతే పాత కాలం నాటి అత్తలతో కొత్త సమస్య లుంటాయి. చదువు లేకపోవడం, తక్కువ చదువుకోవడం కూడా ఒక్కోసారి ఘర్షణలకు కారణమవుతుంది. అత్తా కోడళ్ళ మధ్య చాలా రకాల

పోటీలు ఉంటాయి. ఆస్తిపాస్తులు, కట్నంగా తెచ్చిన సొమ్ములు, అందచందాలు, వంశప్రతిష్ట వగైరా అనేక కారణాల వల్ల ఒకరికి మరొకరిపై ఆధిక్యతా భావం లాంటిది కూడా చోటు చేసుకోవచ్చు. అందువల్ల మరొకరిని తక్కువగా చూడ్డం మొదలవుతుంది.

కోడలిని కూతురిని ఒకే విధంగా చూడకుండా కూతురికి ప్రాధాన్యం ఇవ్వడం కూడా ఘర్షణకు కారణమవుతుంది. కూతురికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఇంటి వ్యవహారాల్లో కూతురి సలహా సూచనల ప్రకారం వ్యవహరించడం కూడా జరుగుతుంటుంది. అలాగే తోటికోడళ్ళలో ఎవరో ఒకరికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం మిగిలిన వారిని తక్కువ చేసి చూడడం కూడా ఘర్షణలకు కారణమవుతుంది. కొన్ని సార్లు కోడలు గయ్యాళిగా అత్తను, ఆడపడుచులను రాచి రంపాన పెట్టడం కూడా జరగవచ్చు. ఆడపడుచుపై అనవసరంగా అధికారం చెలాయించడం వగైరా పనులకు పాల్పడవచ్చు. ఇలాంటి కోడలు భర్త తనకే స్వంతం అనుకుంటుంది. ఒక తల్లికి కొడుకని, ఒక చెల్లికి అన్న అని మరిచిపోతుంది. ఇలాంటి సందర్భాల్లో భర్త కూడా ఈ వివాదాల్లో సాధారణంగా తన భార్యాపిల్లలవైపే నిలబడతాడు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పట్ల మునుపటి ప్రేమ అతనిలో మిగలదు. అత్తాకోడళ్ళ ఘర్షణల్లో సాధారణంగా అహంకారం, గర్వం, అబద్ధాలు, చాడీలు, ఆరోపణలు, అనుమానాలు, ఈర్ష్య, అసూయ, అన్యాయం, ద్వేషం వంటి అనేక రుగ్మతలు చోటు చేసుకుంటాయి.

అత్త తన గతాన్ని విశ్లేషించుకుని నిర్మాణాత్మకంగా ఆలోచిస్తే, కోడలు ఉత్తమ నైతికతతో తన అత్తా ఆడపడుచుల పట్ల ప్రేమగా వ్యవహరిస్తే, కొడుకు అందరి హక్కులను న్యాయబద్ధంగా చెల్లిస్తుంటే ఇల్లు స్వర్గతుల్యం అవుతుంది. కుటుంబంలో కలతలకు మరో కారణం ఉమ్మడి కుటుంబం కూడాను. అందరూ కలిసి ఉండడం వల్ల ఒక్కోసారి ఒకరి హక్కును మరొకరు నిరాకరించే పరిస్థితులు రావచ్చు. ఒకరిపై మరొకరు పెత్తనం చెలాయించే ప్రయత్నాలు జరగవచ్చు. దంపతుల మధ్య ఇతర కుటుంబ సభ్యులు అనవసరంగా జోక్యం చేసుకోవడం వల్ల మనస్పర్థలు, ఉద్రిక్తతలు పెరుగుతాయి. ఒక్కోసారి భర్త కోపావేశంలో తలాక్ ఇచ్చేస్తాడు.

దాంపత్య జీవితంలో వివాదాలకు కారణాల్లో మనిషిలో ఉండే కోపం

కూడా ఒకటి. భార్య పట్ల భర్తకు ఏ విషయంలో అయినా కోపమొస్తే భార్య అప్పుడు కాస్త శాంతంగా వ్యవహరించాలి. తాను నోరు పారేసుకోకూడదు. కొంతసేపు మౌనం వహించి భర్త కోపం చల్లారాక ఆ విషయమై భర్తతో మాట్లాడాలి. భర్త కూడా భార్య పట్ల మృదువగా, సానుభూతితో వ్యవహరించాలి. భార్య కోపంగా ఉన్నప్పుడు భర్త కూడా సహనం చూపాలి. భార్య పుట్టింటి వారు అనవసరంగా జోక్యం చేసుకోవడం, అలాగే భార్య తన అత్తింటివారి వ్యవహారశైలి గురించి చిన్న చిన్న విషయాలు కూడా పుట్టింటి వారి చెవిన వేయడం వంటివి కూడా వివాదాలకు, ఘర్షణలకు కారణ మవుతాయి.

కుటుంబంలో కలతలకు మరో కారణం ఆర్థిక బాధ్యతలు. ఇంటి ఖర్చుల బాధ్యత భర్తదే. అయితే కొన్ని కుటుంబాల్లో సంపాదించే కోడలుకు ప్రాముఖ్యమిచ్చి తెచ్చుకుంటారు. ఆ భార్య సంపాదనపై తనకు పూర్తి హక్కు ఉందని భర్త భావిస్తాడు. భార్య తన డబ్బు కూడా తన ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేయడం కుదరదు. కాగా, కొన్ని ఇండ్లల్లో చదువుకున్న కోడలు ఉద్యోగం చేయాలనుకుంటుంది. కాని భర్త ఒప్పుకోడు. ఇద్దరి మధ్య ఘర్షణ మొదలవుతుంది.

కొన్ని ఇండ్లల్లో భర్తను, భర్త బంధువులను బాగా చూసుకునే స్త్రీలు ఉంటే, కొన్ని ఇండ్లల్లో దానికి వ్యతిరేకమైన పరిస్థితి ఉంటుంది. చట్టాల అండ చూసుకుని భర్తను, భర్త తరపు బంధువులను వేధించే వారూ ఉన్నారు. కొన్ని ఇండ్లల్లో కోడలిని పనిమనిషిగా చూస్తుంటారు. ఇంటి పని మొత్తం ఆమె నెత్తిన వేసేస్తారు. మరికొన్ని ఇండ్లల్లో కోడలు ఇంటిపని చేయడం నామోషీగా భావిస్తుంది.

దాంపత్య జీవితంలో ఇవన్నీ అవాంఛనీయమైన, అనుచితమైన వ్యవహారాలు. దీనికి కారణం ఇస్లామీయ బోధనలను ఆచరించకపోవడమే. భార్యలపై దౌర్జన్యాలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో భర్తలు దౌర్జన్యాలకు గురవుతున్నారు. భార్యాభర్తలు ఇరువురు ఇస్లామ్ ప్రసాదించిన హక్కులు బాధ్యతలకు సరయిన విధంగా కట్టుబడి నట్లయితే కుటుంబాల్లో కలతలే ఉండవు. ముస్లిమ్ సమాజంలో అల్లాహ్ హక్కుల విషయంలో నిబద్ధత కనిపిస్తుంది. దేవుని విషయంలో నిర్వర్తించవలసిన కర్తవ్యాలను చాలా దీక్షగా పాటిస్తారు. కాని తోటివారి హక్కుల విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తుంది. కుటుంబ జీవనంలో

మనుషులు పరస్పరం కలిసి మెలిసి జీవించవలసి ఉంటుంది. అందువల్లనే ఉత్తమమైన, మేలైన వ్యవహారశైలిని పాటించాలని చెప్పడం జరిగింది.

6. వివాదాలను పరిష్కరించుకునే పద్ధతులు

దంపతుల మధ్య పొరపొచ్చలు రావచ్చు. ఒకరిపై మరొకరికి కోపం రావచ్చు. ఒకరి వల్ల మరొకరు బాధపడవచ్చు. భార్య వల్ల భర్తకు ఏవిధంగా బాధ కలిగినా కాస్త సహనంతో వ్యవహరించాలి. భార్యకు నచ్చచెప్పి మార్చుకునే ప్రయత్నం చేయాలి. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

> **"వారితో (భార్యతో) సద్భావంతో జీవితం గడపండి. ఒకవేళ మీకు వారు నచ్చకపోతే, బహుశా మీకు ఒక వస్తువు నచ్చకపోవచ్చు. కాని అందులోనే అల్లాహ్ ఎంతో మేలును పెట్టివుండవచ్చు."** ***(దివ్య ఖుర్ఆన్- 4 :19)***

అంటే అర్థం భర్త తొందరపాటుతో దాంపత్య జీవితాన్ని ముగించే నిర్ణయం తీసుకోరాదు. భార్యకు నచ్చచెప్పాలి. అప్పటికి సమస్య పరిష్కారం కాకపోతే పడకలు వేరు చేయాలి. అవసరమైతే మందలించవచ్చు. వారిద్దరి మధ్య పొరపొచ్చలు వారే పరిష్కరించుకోవడం సాధ్యపడకపోతే, అప్పుడు ఇరువురి బంధువులు వారి మధ్య సయోధ్య కుదర్చడానికి, సమస్య పరిష్కరించడానికి ప్రయత్నాలు చేయాలి. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే, దంపతుల మధ్య మనస్పర్థలు అలాగే కొనసాగితే, భర్త తలాక్ ఇవ్వవచ్చు. అదేవిధంగా భార్య కూడా తన తరఫున ఖులా, ఫిస్క్ నికాహ్, ముబారహ్, తఫ్వీజ్ తలాక్ వంటివి ఉపయోగించుకోవచ్చు. అయితే పరిస్థితి అంత దుర్భరంగా లేకపోయినప్పటికి ఖులా కావాలని కోరే మహిళ స్వర్గసువాసనలకు కూడా నోచుకోదని ప్రవక్త (స) హెచ్చరించారు (అబూదావూద్).

7. తలాక్ ఇవ్వడంలో అనుచితమైన పద్ధతి- దాని వల్ల నష్టాలు

భార్యాభర్తలు వేరుపడడానికి ఒక్క తలాక్ చాలు. ఒకేసారి మూడు

తలాక్‌లు ఇవ్వడం పెద్దపాపం, దివ్యఖుర్‌ఆన్ బోధనలకు విరుద్ధం. ఇలా చేసే వ్యక్తి పాపానికి పాల్పడినట్లే. అతను దైవం, దైవప్రవక్తల ఆగ్రహానికి గురవుతాడు. షరీఅత్ విరుద్ధమైన ఈ పద్ధతిలో తలాక్ ఇవ్వడమంటే భర్త తిరిగి ఆమెను వివాహమాడే హక్కును కోల్పోతాడు.

ఒక వ్యక్తి తన భార్యకు మూడు తలాక్‌లు ఇచ్చిన విషయం ప్రవక్త ముహమ్మద్ (స)కు తెలిసినప్పుడు ఆయన తీవ్రకోపంతో లేచినిలబడ్డారు. "నేను ఉండగానే దైవగ్రంథంతో ఆటలాడుతున్నారా" అన్నారు (నిసాయి). అంటే ఒకేసారి మూడు తలాక్‌లు ఇవ్వడమంటే దివ్యఖుర్‌ఆన్ పట్ల అనుచితంగా వ్యవహరించడంతో సమానం.

చిన్న చిన్న విషయాలకు, కోపావేశాలతో తలాక్ ఇవ్వరాదు. నికాహ్ సమయంలో "ఖుబూల్ హై" అనే రెండు మాటలతో దాంపత్యానికి ఆమోదం తెలిపి ఇద్దరు అపరిచితులైన స్త్రీపురుషులు దాంపత్య జీవితాన్ని ప్రారంభిస్తారు. అదేవిధంగా ఈ సంబంధం తలాక్ చెప్పడంతో ముగిసిపోవచ్చు. కాని తలాక్ ప్రభావం కేవలం ఒక్క వ్యక్తిపై ఉండదు. దంపతులిద్దరు మాత్రమే దీని వల్ల నష్టపోవడం జరగదు. దీనివల్ల కుటుంబం విచ్ఛిన్నం అవుతుంది. రెండు కుటుంబాల్లో మనస్పర్థలు, వైరాలు పెరుగుతాయి. కొత్తతరం భవిష్యత్తు దెబ్బతింటుంది. ఈ ప్రభావం పూర్తి సమాజంపై ఉంటుంది.

సమాజాన్ని పరిశీలిస్తే మూడు తలాక్‌లు ఇవ్వడం వల్ల నష్టపోయేది స్త్రీయే. అకస్మాత్తుగా ఆమె ఇల్లు ఆమెది కాకుండా పోతుంది. ఒకవేళ తల్లిదండ్రులు ఉంటే పుట్టింటికి వెళుతుంది. తల్లిదండ్రులు లేకపోతే ఆమెకు దుర్భర పరిస్థితి ఎదురవుతుంది. విడాకులు పొందిన స్త్రీని మన సమాజంలో చిన్నచూపు చూడడం జరుగుతోంది. ఆమెను నిందించడమూ, ఎత్తిపొడుపులు సర్వసాధారణం. మరో పెళ్ళి జరగడం చాలా కష్టం. పిల్లలుంటే, పిల్లలు తల్లితోనే ఉండాలనుకుంటారు. తల్లి కూడా తన పిల్లలను దూరం చేసుకోలేదు. ఇస్లామీయ షరీఅత్ ప్రకారం విడాకులు పొందిన తర్వాత స్త్రీకి ఇద్దత్ కాలం ముగిసిన తర్వాత భరణం దొరకదు. కాని పిల్లల పోషణ భారం తండ్రిపైనే ఉంటుంది. కాని ఆచరణలో

చూస్తే పిల్లల పోషణ ఖర్చు ఆమెకు చాలా తక్కువ లభిస్తుంది. కొన్ని సందర్భాల్లో అది కూడా ఇవ్వకుండా నిరాకరిస్తుంటారు.

ఇదంతా మధ్యతరగతికి చెందిన మహిళ పరిస్థితి అయితే దిగువ తరగతికి చెందిన మహిళల పరిస్థితి మరింత దుర్భరంగా ఉంది. ఆమె పగలంతా కష్టపడి చెమట చిందించి నాలుగు రూపాయలు సంపాదిస్తే తాగుబోతు భర్త ఆమెపై దౌర్జన్యం చేసి అది కూడా లాక్కుంటాడు. కనీస అవసరాలు తీరవు, విద్య ఉండదు, తాగుబోతు భర్త చెడు అలవాట్ల వల్ల భార్య గృహహింసకు బలవుతుంటుంది.

సాధారణంగా స్త్రీలు ఈ సమస్యలకు పరిష్కారం లేదని భరిస్తుంటారు. కొందరు స్త్రీలు అవగాహన లేకపోవడం వల్ల, అజ్ఞానం వల్ల సమస్యల పరిష్కారానికి పోలీసు స్టేషన్ల చుట్టు, కోర్టుల చుట్టు తిరిగేవారు కొందరు. లేదా ఏదైనా స్వచ్ఛంద సంస్థ సహాయం తీసుకుంటారు. కాని వారికి సరయిన దారి చూపించడం అక్కడ కూడా జరగదు. కేసులు దాఖలవుతాయి. కేసు నడిచినంత కాలం అనేక కష్టాలు తప్పవు. న్యాయవాదులకు భారీ ఫీజులు ముట్టజెప్పాలి. వాయిదాలపై వాయిదాలు పడతాయి. కేసు బలంగా ఉండడానికి ఇరుపక్షాలు వీలయినన్ని అబద్ధాలు చెబుతాయి. కేసు వివరాలు వార్తల్లోకి వచ్చిన తర్వాత ఇస్లామ్ వ్యతిరేకులు వెంటనే ఇస్లామ్‌ను వేలెత్తి చూపే అవకాశం దొరుకుతుంది. మీడియా ఈ అవకాశాన్ని వదలకుండా మరింత సంచలనం చేయడానికి ప్రయత్నిస్తుంది. ఇస్లామ్ ప్రతిపాదించే కుటుంబ చట్టాలు స్త్రీలను అణిచివేస్తున్నాయన్న హంగామా మొదలవు తుంది.

ముస్లిమ్ సమాజంలో ఇలాంటి సమస్యల పరిష్కారానికి షరీఅత్‌బద్ధమైన వ్యవస్థ ఏదీ లేదు. ముహల్లాలన్నీ సర్వే చేసి, సామాజిక, కుటుంబ పరిస్థితులను అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. ప్రతి చోట కౌన్సిలింగ్ కేంద్రాలు, షరయీ పంచాయతులు, దారుల్ ఖజా వ్యవస్థ ఏర్పరచడం అవసరం. అప్పుడే ఈ పరిస్థితిని నివారించగలం. ఇస్లామీయ బోధనల పట్ల ముస్లిముల్లో అవగాహన పెంచగలం. తమ సమస్యలను ఖుర్‌ఆన్, సున్నత్ వెలుగులో పరిష్కరించుకునే చైతన్యం వికసిస్తుంది.

8. బహు భార్యత్వం

ఇస్లామీయ కుటుంబ చట్టాలు మానవ స్వభావానికి తగినవి. వ్యక్తికి, కుటుంబానికి, సమాజానికి కారుణ్యం వంటివి. బహుభార్యత్వానికి అనుమతి ఇవ్వడం జరిగిందే తప్ప అది తప్పనిసరి కాదు. ఈ అనుమతి కూడా షరతులతో కూడినది. భార్యల మధ్య పూర్తి న్యాయం చేయవలసి ఉంటుంది. న్యాయం చేయలేకపోతే ఒకే భార్యను మాత్రమే వివాహమాడాలి. సమాజంలో విడాకులు పొందిన మహిళలు, వితంతు మహిళలు, ఆధారంలేని మహిళలకు అవసరమైన ఆసరా కల్పించడానికి ఇవ్వబడిన అనుమతి ఇది. ఈ విధంగా ఇలాంటి మహిళల మానవ సహజమైన కోరికలు ధర్మబద్ధమైన పద్ధతిలో నెరవేరుతాయి. సమాజంలో పరిశుద్ధత, పవిత్రతలకు ఇది ఉపయోగపడుతుంది.

బహు భార్యత్వం అన్నది పురుషుల సుఖవిలాసాల కోసం కాదు. నిజానికి దీనివల్ల పురుషుడి బాధ్యత మరింత పెరుగుతుంది. భార్యల మధ్య న్యాయం, సమానత్వం, సమాన వ్యవహారశైలి, భార్యాపిల్లలందరి పోషణ భారం నెరవేర్చవలసి ఉంటుంది. పెళ్లి తర్వాత పురుషుడు భార్యాపిల్లల ఖర్చులు, భార్యల మధ్య న్యాయం, సమానత్వం పాటించడం, వారి అవసరాలు తీర్చడం వగైరా బాధ్యతలన్నీ నెరవేర్చక తప్పదు. సుఖవిలాసాలు కోరుకునే వ్యక్తి ఇవన్నీ నెత్తినేసుకునే బదులు, పెళ్ళిళ్ళు చేసుకునే బదులు, రహస్యంగా అనేకమంది మహిళలతో సంబంధాలు కొనసాగిస్తాడు. ఇల్లు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉండదు, ఖర్చులు భరించవలసిన అవసరం ఉండదు. వైద్యఖర్చులు భరించవలసిన అవసరం ఉండదు. పిల్లల చదువులు ఖర్చులు భరించవలసిన అవసరం ఉండదు.

9. మహిళల ఆస్తిహక్కు

మహిళకు కూడా ఇస్లామ్ ఆస్తిలో హక్కు ఇచ్చింది. ఈ హక్కు కొన్ని సందర్భాల్లో పురుషుడికి సమానంగాను, కొన్ని సందర్భాల్లో పురుషుడి వాటాలో సగము ఇవ్వబడింది. పురుషుడి వాటాలో సగం మాత్రమే ఇవ్వడానికి కారణం ఆర్థికంగా ఖర్చుల బాధ్యత పురుషుడిపైనే ఉంది. స్త్రీపై ఆర్థిక భారం ఏదీ లేదు. పురుషుడు నికాహ్ సమయంలో మహర్ చెల్లించాలి. భార్యాపిల్లలు, అక్కాచెల్లెళు ళ్ళ, తల్లిదండ్రుల పోషణ ఖర్చులన్నీ చూడాలి.

కాని మన సమాజంలో సాధారణంగా స్త్రీలకు ఆస్తి హక్కు ఇవ్వడానికి ఇష్టపడరు. వధువుకు పెళ్ళి సందర్భంగా వరకట్నం ఇస్తున్నాము కదా అని సమర్థించుకునే ప్రయత్నం చేస్తారు. నిజానికి వరకట్నం దురాచారం. దాన్ని నిర్మూ లించాలి. అలాగే ఆస్తిలో మహిళలకు ఇవ్వబడిన హక్కును వారికి నిరాకరించరాదు. సంతోషంగా వారికి ఆస్తిలో వాటా ఇవ్వాలి.

10. మనం చేయవలసిన పనులు

1. అన్నింటికన్నా ముందు ఆలోచనాసరళి, అవగాహన పెంచుకోవాలి. మహిళలు దివ్యఖుర్ఆన్ అర్థం చేసుకుని చదవాలి. ముఖ్యంగా ఇస్లామీయ కుటుంబ చట్టాలను లోతుగా అర్థం చేసుకోవాలి. అందుకు అనుగుణంగా సుహృద్భావ సంబంధాలు పెంపొందేలా ప్రయత్నాలు చేయాలి.
2. రెండవ పని సంతానానికి తగిన శిక్షణ. పిల్లల పోషణ శిక్షణ పట్ల శ్రద్ధ చూపాలి. వారి ఆధ్యాత్మిక శిక్షణ పట్ల దృష్టి పెట్టాలి. అల్లాహ్ చూస్తున్నా డన్న భావన పిల్లల్లో బలపడేలా, అల్లాహ్ ముందు జవాబీయాలన్న బాధ్యతాభావం పెరిగేలా చూడాలి. వారు వివాహ వయస్సుకు చేరుకున్నప్పుడు ఇస్లామీయ కుటుంబ చట్టాల గురించి వారికి అవగాహన కల్పించాలి.
3. నిరాడంబరమైన నికాహ్‌ను ప్రోత్సహించాలి. అనవసరపు ఆచారాలు, సంప్రదా యాలను విడిచిపెట్టాలి.
4. కౌన్సిలింగ్ కేంద్రాలు, షరయీ పంచాయతులు, దారుల్ ఖజాలు ఏర్పరిచే ప్రయత్నం చేయాలి. మన కుటుంబం, బంధువులు, స్నేహితులు, సన్నిహితుల్లో ఎక్కడ కుటుంబ వివాదాలున్నా అవి కౌన్సిలింగ్ సెంటర్ల ద్వారా, షరయీ పంచాయతులు, దారుల్ ఖజాల ద్వారా పరిష్కారమ య్యేలా చూడాలి.
5. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తూ ఉండాలి. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ఇస్లామ్‌కు వ్యతిరేకంగా ప్రచారమవుతున్న అపోహలు, అపార్థాలను సమర్థవంతంగా ఎదుర్కొని జవాబీయాలి.

6. ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు: ధార్మికజ్ఞానం ఉన్న పొరుగువారు, ధార్మిక జ్ఞానం లేని పొరుగువారికి నేర్పాలి. ధార్మికజ్ఞానం లేని పొరుగువారు, ధార్మిక జ్ఞానం ఉన్న పొరుగువారి నుంచి నేర్చుకోవాలి. (తిబ్రానీ)

ఈ హదీసు ప్రకారం ధార్మిక జ్ఞానం ఉన్నవారు ధార్మికజ్ఞానం లేని వారికి నేర్పాలని ప్రోత్సహించడం జరిగింది. ఇరుగు పొరుగు వాడకట్టులో, ముహల్లాల్లో ధార్మిక ఇజ్తిమాలు జరుగుతుంటే వాటిలో పాల్గొనాలి. అలాంటివి జరగకపోతే స్వయంగా ఇజ్తిమాలు ఏర్పాటు చేయాలి.

7. సాముదాయిక జీవితం గడపాలి. ఎందుకంటే ప్రవక్త ముహమ్మద్ (స) వ్యక్తిగతంగా ఎవరికి వారే కాదు, సాముదాయికంగా అందరూ కలిసి జీవించాలని చెప్పారు.

8. మీ ఊరు లేదా పట్టణంలో మురికివాడల సర్వే చేయాలి. అక్కడ కుటుంబ జీవితాలు, సామాజిక సమస్యలు, ఆరోగ్యం, పరిశుభ్రత, ఉపాధి, సామాజిక స్థితిగతులు తెలుసుకోవాలి. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

9. ఉన్నత విద్యావంతులు, మధ్యతరగతి, నిరక్షరాస్యులు అందరూ ఇస్లామీయ కుటుంబ చట్టాల గురించి తెలుసుకునేలా ప్రయత్నాలు జరగాలి.

10. ముహల్లా మస్జిదులో మహిళలు రావాలనుకుంటే, వారికి అవసరమైన సదుపాయాల విషయంలో మస్జిదు కమిటీతో చర్చించాలి. ఆ విధంగా మహిళలు అక్కడ ఇస్లామీయ బోధనలు తెలుసుకోవడం, ఆరాధనల్లో పాల్గొనడంతో పాటు తమ సమస్యలను ఉలమాలకు నివేదించే అవకాశం లభిస్తుంది. ఖుర్ఆన్, హదీసుల వెలుగులో సమస్యల పరిష్కారం గురించి తెలుసుకునే వీలవుతుంది.